చెత్త పన్నుకు చెక్



- వసూలు నిలిపేయాలని ఆదేశాలు
- ఇచ్చిన మాట నిలబెట్టుకున్న చంద్రబాబు
- ప్రజలపై ఆర్థిక భారం తొలగించిన కూటమి ప్రభుత్వం
- ఇప్పటికే జిల్లాలో రూ.1.10 కోట్ల వసూలు

తాము అధికారంలోకి వస్తే చెత్త పన్ను రద్దు చేస్తామని టీడీపీ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు ఎన్నికల సమయంలో ప్రజలకు హామీ ఇచ్చారు. ప్రమాణ స్వీకారానికి ముందే ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారు. వైసీపీ విధించిన చెత్త పన్నును రద్దు చేస్తూ ఆయా మున్సిపాలిటీలకు ఆదేశాలందాయి. ఇప్పటికే జిల్లాలో చెత్త పన్ను రూపంలో రూ.1.10 కోట్లను వైసీపీ ప్రభుత్వం వసూలు చేసింది. కూటమి ప్రభుత్వ నిర్ణయంతో పట్టణ ప్రాంత ప్రజలకు ఊరట లభించింది.

- ఆంధ్రజ్యోతి, చిత్తూరు

జిల్లాలో చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్‌తో పాటు నాలుగు మున్సిపాలిటీలున్నాయి. కుప్పం కొత్తగా మున్సిపాలిటీగా ఏర్పడడంతో దాన్ని మినహాయించి మిగిలిన పుంగనూరు, పలమనేరు, నగరి మున్సిపాలిటీల్లో చెత్త పన్ను వసూలు చేశారు. 2022 జూలై ఒకటో తేదీ నుంచి ఆయా మున్సిపాలిటీల్లో ఎంపిక చేసిన వార్డుల్లో పన్ను వసూలుకు శ్రీకారం చుట్టారు. చిత్తూరులో 50 డివిజన్లు ఉండగా తొలుత 11 డివిజన్లను ఎంపిక చేశారు. అనుగుణంగా చెత్త సేకరణకు 11 క్లాప్ ఆటోలను చిత్తూరుకు ప్రభుత్వం పంపింది. ఈ డివిజన్లలో కుటుంబాల సంఖ్యను బట్టి రూ.1.71 కోట్ల పన్ను వసూలు చేయాలని అధికారులు నిర్ణయించారు. ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత రావడంతో వసూలులో మున్సిపల్ సిబ్బంది ఇబ్బంది పడాల్సి వచ్చింది. ఇలా మొత్తం ఒక్క చిత్తూరులోని 11 డివిజన్లలోనే రూ.70 లక్షల చెత్త పన్ను వసూలు చేశారు. పుంగనూరు నుంచి రూ.21 లక్షలు, పలమనేరులో రూ.12 లక్షలు, నగరి మున్సిపాలిటీ నుంచి రూ.8లక్షలు వసూలు చేశారు. మొత్తంగా జిల్లాలో రూ.1.10 కోట్లు వసూలు చేశారు. వైసీపీ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి వచ్చి ఉంటే ఎంపిక చేసిన డివిజన్లలోనే కాకుండా అన్ని డివిజన్ల నుంచీ పన్ను వసూలు చేసేది. ప్రభుత్వం మారడంతో పట్టణ ప్రజలకు పన్ను విషయంలో ఊరట లభించింది.

కరెంటు, ఆర్టీసీ చార్జీలు, మద్యం ధరలు ఇష్టానుసారం పెంచి సామాన్యుల నడ్డి విరిచిన జగన్ చెత్త పన్ను అనే కొత్త విధానం తీసుకొచ్చి పట్టణ ప్రాంత వాసులను ఇబ్బందిపెట్టారు. చెత్త మీద పన్ను వసూలు చేసే చెత్త సీఎం అని ప్రతిపక్షాల నుంచి అనిపించుకున్నారు. ప్రజల నుంచి వ్యతిరేకత వచ్చినా.. ప్రతిపక్షాలు ఆందోళనలు చేసినా.. వైసీపీ ప్రభుత్వం మాత్రం చెత్త పన్ను విషయంలో వెనక్కి తగ్గలేదు. మున్సిపల్ కార్పొరేషన్లలో ఇంటికి రూ.120 చొప్పున, మున్సిపాలిటీల్లో రూ.90 చొప్పున నెలకో సారి వసూలు చేశారు. దుకాణాల మీద ఈ భారం మరింత అధికంగా ఉండేది.

అహంకారం తలకెక్కితే ఇంతే!

- మీరు కుప్పం వదిలి పారిపోతే మేమేం కావాలి?
- నేతలపై వైసీపీ కార్యకర్త ఆక్రోశం



వైసీపీ కార్యకర్త రాజేంద్ర

కుప్పం, జూన్ 10: 'పార్టీ ఓడిపోతే అండగా ఉండాల్సిన మీరే దొంగల్లాగా పారిపోయారు. అధికారముందని అహంకారం తలకెక్కితే ఇదే గతి పడుతుంది. ఇప్పుడు మేమేం కావాలి?' అంటూ వైసీపీ కార్యకర్త ఒకరు తమ నాయకులపై ఆగ్రహావేశాలతోపాటు ఆక్రోశం వెళ్లగక్కారు. సెల్ఫీ వీడియో తీసి సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేశారు. కుప్పం మున్సిపాలిటీ పరిధిలో ఒక బూత్ నుంచి వైసీపీ కోసం ఎన్నికల్లో పనిచేసిన రాజేంద్ర అనే కార్యకర్త నేతల వ్యవహార శైలిపై దుమ్మెత్తిపోసిన వీడియో ఇప్పుడు కుప్పంలో హాట్ టాపిక్‌గా మారింది. వైసీపీ కార్యకర్తల ఆక్రోశాన్ని ప్రతిబింబించే ఆ వీడియోలో మాటలు ఇవీ..

'ఎందుకు ఓడిపోయాం మనం? భరత్, సెంథిల్ వీరే తోపులు. వీళ్లే తురుపులు. కార్యకర్తల్ని పట్టించుకోలేదు. పదీపన్నెండేళ్లు మీ పక్కనే ఉన్నాం. లాస్ట్‌కు జగనన్నను దగ్గరుండి నాసినం చేస్తిరి. ఇంటికొస్తే కనీసం మనిషిని మాట్లాడించే దిక్కు కూడా లేదు. నేను కుప్పంలో ఒక పంచాయతీకి పనిచేశాను. నువ్వు ఎంత బాడ్‌కోవ్ పనులు చేసుంటే కుప్పం వదిలి వెళ్లిపోతావ్? నిన్ను నమ్ముకున్న కార్యకర్తలు ఏం కావాలిప్పుడు? మేం చచ్చిపోతుండాం ఈడ. నీకు మైనస్ ఉంది. మాకు ప్లస్ ఉంది. నీతి నిజాయితీగా మంచిగున్నాం. ఎవరి సొమ్ము తిన్నా. టీడీపీ కార్యకర్తలైనా, వైసీపీ కార్యకర్తలైనా కలసిమెలసి కనీసం మంచిగుంటిమి మేము. నువ్వు, నీ కూడా ఉండేవాళ్లు అనవసరంగా గొడవలు పెట్టి, అనవసరంగా పంచాయతీలు చేసి ఈ గతికి తెస్తిరి. నిజమైన కార్యకర్తల్ని నువ్వు నమ్మలేదు. ఏళ్లతరబడి నీతోపాటు ఉంటే కార్యకర్తలకు ఏమి చేస్తివి? అధికారముందని అహంకారం పడితే ఇలానే ఉంటుంది. మనిషికి విలువనిచ్చేది నేర్చుకో. అధికారంలో ఉన్నన్నాళ్లు నీకెంతొచ్చింది, నాకెంతొచ్చింది ఇవీ పంచాయతీలు. అయిదు ఓట్లు వేయించే బగిసిలేని లెనిన్ షర్ట్ వేసుకునేవాడు కలెక్షన్ కింగ్ నీకు. ఏదన్నా ప్రాబ్లమ్ అని మాలాంటి నిజాయితీ కలిగిన కార్యకర్తలు వొస్తే సెటిల్‌మెంట్ చేసుకో అంటావు. ఇన్నాళ్లు గమ్మునుండి ఓడిపోయాక మాట్లాడతా వుండాను అంటావేమో. ఇన్నాళ్లు నువ్వు చేసిన పొరపాటు చెబితే కూడా వినే పొజిషన్‌లో లేవు. నీకు అహంకారం మెడకెక్కేసింది. నేను ఏ తప్పూ చేయలా. నన్నేమన్నా మాట్లాడినారా టీడీపీవోళ్లు? న్యాయమంటే అట్లుండాల. అదీ లెక్కాచారం. అనవసరంగా కుప్పమొక్కటే కాదు, స్టేట్‌నే నాశనం చేసినారు. సంపాదించుకుని పారిపోయినారు. మేం మాత్రం ఈడ కూచ్చుని అవమానం పాలవతా వుండాము. మేమేడకి పోవాల. డబ్బు లేదు. పార్టీ ఓడిపోతే అండగా ఉండాల్సిన మీరే దొంగల్లాగా పారిపోతే మేమేం చెయ్యాల? నేను జగనన్న పార్టీనే, తెలుసు అందరికీ. నన్నెవరూ మాట్లాడలేదే. నిజాయితీగా ఉండాను కాబట్టే, ధైర్యంగా ఉండా. లీడర్లే పరిగెత్తి పూడిస్తే, కార్యకర్తలు నాశనం కావాలా? ఇకనైనా మనుషుల్లా బతకండి ఫస్ట్.'



రూ.25 కోట్లు గోవిందా!

వైసీపీ నేతకు ముడుపులిచ్చి నష్టపోయిన తిరుమల వ్యాపారులు

అప్పుడే తట్టలపైబడ్డ టీడీపీ నేతలు

తిరుపతి, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : తిరుమలలో తట్టలు, షాపుల లైసెన్సుల రెన్యువల్ కోసం అధికార పార్టీ నాయకులకు దాదాపు రూ.25కోట్లు ముడుపులుగా చెల్లించుకున్న వ్యాపారులు, ప్రభుత్వం మారిపోవడంతో లబోదిబోమంటున్నారు. టీటీడీ పాలకమండలి ఆమోదం కూడా పొందిన ఈ వ్యవహారంలో వైసీపీ ముఖ్య నాయకుడు పెట్టిన ఎన్నికల మెలికవల్ల దుకాణాల ఏర్పాటు ఆగిపోయిందని, కొత్త ప్రభుత్వం కొనసాగిస్తుందనే నమ్మకం లేదని వారు ఆందోళన చెందుతున్నారు.తామిచ్చిన డబ్బులైనా వెనక్కివ్వండంటూ వారు ఆ నాయకుడి వెంట పడుతున్నట్టు సమాచారం.

తిరుమల కొండమీద షాపులు, తట్టల ఏర్పాటుకు టీటీడీ జారీ చేసే లైసెన్సులను ఎప్పటికప్పుడు రెన్యువల్ చేసుకోవాల్సి వుంటుంది. కాలపరిమితి ముగిసిన వాటిని రెన్యువల్ చేసుకోవాలంటే ఉన్నత స్థాయి రాజకీయ సిఫారసుతో పాటు భారీగా డబ్బు ఖర్చు పెట్టుకోవాల్సి వుంటుంది. ఇలాంటి గడువు ముగిసిన సుమారు 230కు పైగా తట్టలు, 17 దుకాణాల లైసెన్సులను రెన్యువల్ చేసుకునేందుకు వాటిని కొనుగోలు చేసిన వ్యాపారులు కొందరు ఈ ఏడాది ప్రారంభంలో గ్రూపుగా ఏర్పడి ప్రయత్నాలు చేశారు. వైసీపీ ముఖ్యనేతను కలసి మొరపెట్టుకున్నారు. ఉత్త చేతులతో పనులు జరగవు కాబట్టి తలా కొంచెం చొప్పున రూ. పాతిక కోట్లు వసూలు చేసి ముఖ్యనేతకు ముట్టజెప్పారని సమాచారం. అందుకు తగ్గట్టే ఈ ఏడాది ఫిబ్రవరి 26న పాలకమండలి సమావేశంలో వీటికి అనుమతులు కూడా ఇచ్చేశారని తెలిసింది. వ్యాపారులు సంబరపడి షాపులు పెట్టుకునేలోగా సహకరించిన నేతే అడ్డుపుల్ల వేశారంటున్నారు. ఎన్నికల్లో వ్యాపారులు తమ పరిధిలో అధికార పార్టీకి మెజారిటీ తెప్పించిన తర్వాతే తట్టలు, షాపులు ఏర్పాటు చేసుకునేందుకు అనుమతి ఇప్పిస్తామని చెప్పారంటున్నారు. అయితే ఎన్నికల్లో వైసీపీ ఊడ్చుకుపోయింది. వ్యాపారులకు అప్పగించిన బూత్‌లలోనూ జనసేనకు భారీగా ఆధిక్యత వచ్చింది. తిరుమల కొండపై జనసేన అభ్యర్థికి ఏకంగా 1200ఓట్ల మెజారిటీ వచ్చింది. దీంతో నాయకుడి తీరు తెలిసిన వ్యాపారులు ఆందోళనపడి టీటీడీ అధికారులను ఆశ్రయించారని చెబుతున్నారు.వాళ్లు చేతులెత్తేయడంతో పనీ జరగక, చేతులు మారిన డబ్బూ తిరిగి రాక వ్యాపారులు శోకాలు పెడుతున్నట్టు సమాచారం.

షాపుల తరలింపునకూ చుక్కెదురు!

ఇదే సమయంలో కొండపైన ఏడు దుకాణాలను భక్తుల రద్దీ ఎక్కువగా వుండే ప్రాంతాలకు తరలించేందుకు ఎన్నికలకు ముందు కొందరు ప్రయత్నించారు. కొంత చేతిచమురు వదుల్చుకుని మరీ అమోదం పొందినా వారి తరలింపులు పూర్తికాలేదు.ఈలోగా జాతకాలు తారుమారు కావడంతో వీరు కూడా ఆందోళన చెందుతున్నారు. గత గురువారం కీలక అధికారి వద్దకు వీరంతా కలిసి వెళ్ళి కలసి ప్రాధేయపడినట్టు సమాచారం.ఆయనా నిస్సహాయత వ్యక్తం చేయడంతో వీరు కూడా నిస్పృహతో వున్నారు.

ఇపుడు టీడీపీ నేతల దూకుడు

కొండమీద దబాయింపు బదలాయింపులకు ఇప్పుడు టీడీపీకి అవకాశం వచ్చింది.దీంతో అప్పుడే కొందరు టీడీపీ నేతలు దూకుడు చూపుతున్నారు. ఎలాంటి అధికారిక అనుమతులతో నిమిత్తం లేకుండా తమకు తాముగా తిరుమలలో దుకాణాలు ఏర్పాటు చేసుకుంటున్నారు. అది కూడా కీలక ప్రాంతాల్లో కావడం గమనార్హం. తిరుపతి కూటమి అభ్యర్థికి తొలిలోనే మద్దతు పలికిన టీడీపీ నేత ఒకరు సోమవారం ఏకంగా శ్రీవారి ఆలయం ఎదురుగా వున్న అఖిలాండం సమీపంలోనే నాలుగు తట్టలు ఏర్పాటు చేశారు. వీటికి టీటీడీ నుంచీ ఎలాంటి అనుమతులూ లేవు. అలాగే తిరుమలలో టీడీపీ నాయకుడిగా వ్యవహరిస్తున్న మరొకరు తానేం తక్కువ తినలేదని సోమవారమే పాత అన్నదాన సత్రం వద్ద నాలుగు తట్టలు ఏర్పాటు చేసుకున్నారు. వాటికి కూడా టీటీడీ నుంచీ అనుమతులు లేవు. పాత అన్నదాన సత్రం వద్ద భక్తుల రద్దీ చాలా ఎక్కువగా వుంటుంది. భక్తుల రాకపోకలకు ఇబ్బందిగా వుండడంతో రెండేళ్ళ కిందట అధికారులు ఆ ప్రాంతంలోని తట్టలను తొలగించారు. ఇప్పుడు మళ్లీ ఇక్కడ తట్టలు వెలిశాయి. టీడీపీ ప్రభుత్వం ఇంకా ఏర్పడక ముందే ఆ పార్టీ నేతలు ఈ రీతిలో వ్యవహరిస్తుండడం ఆందోళన కలిగిస్తోంది. తిరుమల వ్యవహారాల్లో అత్యంత క్రమశిక్షణ పాటించే టీడీపీ అధినేత చంద్రబాబు తాజా వ్యవహారాల పట్ల ఎలా స్పందిస్తారో వేచి చూడాల్సి వుంది.

గుట్టుగా తప్పుకుంటున్నారు..

- డీసీసీబీ, మార్కెటింగ్ సొసైటీ, సీడీసీఎంఎస్, ప్రింటింగ్ ప్రెస్ పాలకవర్గాల రాజీనామా
- టౌన్‌బ్యాంకులు, 25 సింగిల్ విండోల కమిటీలు కూడా..

చిత్తూరు కలెక్టరేట్, జూన్ 10: జిల్లాలో నామినేటెడ్ సహకార పాలకవర్గాలు తప్పుకుంటున్నాయి. నేడో రేపో అఫిషియల్ కమిటీలు ఏర్పడనున్నాయి. జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ)కి కలెక్టర్ షన్మోహన్, జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ (సీడీసీఎంఎస్)కి జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు, డిస్ట్రిక్ట్ కోఆపరేటివ్ ప్రింటింగ్ ప్రెస్‌కు డీసీవో నాగవర్ధన ఇన్‌చార్జులుగా వ్యవహరించనున్నారు. ఈ మేరకు త్వరలో అధికారిక ఉత్తర్వులు వెలువడనున్నాయి. అంతవరకు తాత్కాలికంగా సహకార శాఖకు చెందిన అసిస్టెంట్ రిజిస్ట్రార్‌లు, సీనియర్, జూనియర్ ఇన్‌స్పెక్టర్లు అఫిషియల్ పర్సన్ ఇన్‌చార్జులుగా వ్యవహరించనున్నారు. డీసీసీబీ సెవెన్‌మెన్ కమిటీ చైర్‌పర్సన్ ఎం.రెడ్డెమ్మ, సీడీసీఎంఎస్ సెవెన్‌మెన్ కమిటీ చైర్‌పర్సన్ నాగలక్ష్మి, కోఆపరేటివ్ ప్రింటింగ్ ప్రెస్ సెవెన్‌మెన్ కమిటీ అధ్యక్షుడు మురళీమోహన్ రెడ్డి, కుప్పం టౌన్‌బ్యాంకు త్రీమెన్ కమిటీ చైర్మన్ భాగ్యరాజ్ ప్రభంజన్, చిత్తూరు కోఆపరేటివ్ టౌన్‌బ్యాంక్ ఫైవ్‌మెన్ కమిటీ చైర్మన్ బి.రామ్‌గణేష్‌తో పాటు కమిటీ సభ్యులందరూ శనివారం రాత్రి తమ పదవులకు రాజీనామా చేస్తూ డీసీవో నాగవర్ధనకు పత్రాలను పంపారు. అంతేగాక జిల్లాలోని 37 సింగిల్ విండోల్లో 12 కమిటీలు ఇప్పటికీ అఫిషియల్ కమిటీలు కొనసాగుతుండగా, మిగిలిన 25 త్రీమెన్ కమిటీల చైర్మన్లు, సభ్యులు తమ రాజీనామా పత్రాలను పంపారు. రెండ్రోజుల క్రితం నామినేటెడ్ పదవులకు అన్ని పాలకవర్గాల పదవులకు రాజీనామాలు చేయించాలని, రాజీనామాలు చేయని వారిని తొలగించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ జిల్లా సహకార శాఖ అధికారులకు ఉత్తర్వులు జారీ చేసిన విషయం విదితమే.

బోయకొండ ఆలయ చైర్మన్ రాజీనామా

చౌడేపల్లె, జూన్10: బోయకొండ గంగమ్మ ఆలయ చైర్మన్ నాగరాజ రెడ్డి సోమవారం తన పదవికి రాజీనామా చేశారు. ఈ మేరకు తన రాజీనామా పత్రాన్ని ఆలయ ఈవో చంద్రమౌళికి పంపారు. వైసీపీ ఓడిపోయిన తర్వాత నామినేటెడ్ పదవుల్లో ఉన్నవారంతా రాజీనామాలు చేస్తున్న సంగతి తెలిసిందే.

పంటలపై ఏనుగుల స్వైరవిహారం

- మామిడి, టమోటా, వరి ధ్వంసం





ధ్వంసమైన టమోటా పంట - విరిగిపోయిన మామిడి చెట్లు

కల్లూరు, జూన్ 10: పులిచెర్ల మండలంలో ఏనుగుల దాడులు కొనసాగుతున్నాయి. కమ్మపల్లి పంచాయతీలో రెండు రోజులుగా తిష్టవేసిన ఏనుగుల గుంపు పంటలపై స్వైర విహారం చేస్తోంది. టమోటా, మామిడి, వరినారుకు అపారనష్టం వాటిల్లింది. కమ్మపల్లికి చెందిన పార్థసారథి నాయుడు, విజయసారథినాయుడు మామిడి తోటల్లోకి ఆదివారం రాత్రి ప్రవేశించిన ఏనుగులు చెట్లను ధ్వంసం చేశాయి. నీటి పైపులను తొక్కేశాయి. సుమారు 2 టన్నుల మామిడికాయలు నేలరాలాయి. దేశిరెడ్డిగారిపల్లికి చెందిన ఎల్లారెడ్డి ఎకరా టమోటా తోటను తొక్కేశాయి. జగన్నాథరెడ్డి 20 మామిడిచెట్లను విరిచేశాయి. మామిడికాయలు నేలరాలాయి. డ్రిప్ పైపులు ధ్వంసమయ్యాయి. కురవపల్లిలో గోవర్ధన్‌కు చెందిన వరినారును తొక్కి నాశనం చేశాయి. 5 ఏనుగుల గుంపు దాడి చేశాయని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతులు కోరారు.

ఆశాజనకంగా వర్షాలు

తొలి వారంలోనే నెల సగటు కన్నా అధిక వర్షపాతం



చిత్తూరు కలెక్టరేట్, జూన్ 10: నైరుతి రుతుపవనాలు ఆరంభంలోనే మంచి ఫలితాలిస్తున్నాయి. జిల్లాలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ఈ నెల తొలివారంలోనే జిల్లా సగటు కంటే అధిక వర్షపాతం నమోదైంది. పలు మండలాల్లో ఈ నెల సాధారణ వర్షపాతం కన్నా రెండుమూడు రెట్లు ఎక్కువగానే వానలు కురిశాయి. జిల్లా సాధారణ వర్షపాతం 80.8 మిమీ కాగా సోమవారం వరకు 89.6 మి.మీ నమోదైంది. 12 మండలాల్లో అధికంగా, 10 మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది. 8 మండలాల్లో తక్కువ నమోదైంది. పలు మండలాల్లో వంకలు, వాగులు, చెక్‌డ్యామ్‌లు, కుంటలు జలకళను సంతరించుకున్నాయి. ఈ వర్షాలు తొలకరి పైర్లకే కాకుండా మొత్తం ఖరీఫ్ సీజన్‌కు బాగా ఉపకరిస్తాయని రైతులు చెబుతున్నారు. జిల్లావ్యాప్తంగా ఆదివారం ఉదయం 8 నుంచి సోమవారం ఉదయం 8 గంటల వరకు చౌడేపల్లిలో 6.4మి.మీ, పులిచెర్ల 5.0, పూతలపట్టు 3.8, వెదురుకుప్పం 1.6, పెనుమూరులో 1.2మి.మీ వర్షం కురిసింది.

మల్గోబా టన్ను రూ.లక్ష పైనే



వేలంపాట నిర్వహిస్తున్న మండీ యజమానులు

బంగారుపాళ్యం, జూన్ 10: బంగారుపాళ్యం మార్కెట్‌లో నాణ్యమైన మల్గోబా రకం మామిడి టన్ను రూ.1.30 లక్షలు పలికింది. సోమవారం స్థానిక మార్కెట్ యార్డుకు నలగాంపల్లెకు చెందిన భాస్కర్ నాయుడు మల్గోబా మామిడిని తీసుకురాగా చెన్నైలోని పోలూరుకు చెందిన బాలు టన్ను రూ.1.30లక్షలకు కొనుగోలు చేశారు. మల్లిక రకం కేజీ రూ.40 నుంచి రూ.90, బేనిషా రూ.30 - రూ.70, కాలేపాడు రూ.30-రూ.70, నాటీలు రూ.10 - రూ.20, తోతాపురి రూ.26-రూ.36 వరకు ధర పలికాయి. ఈ ఏడాది పంట దిగుబడి అంతంతమాత్రమే ఉండడంతో ధరలు అధికంగా ఉన్నాయని రైతులు అంటున్నారు.

పెద్దిరెడ్డి కోటకు బీటలు

- చెరి మూడు మండలాల్లో టీడీపీ, వైసీపీలకు ఆధిక్యత
- పోరాడి ఓడిన చల్లా బాబు

పుంగనూరు, జూన్ 10: పుంగనూరు రాజకీయాలను 15 ఏళ్లుగా శాసిస్తున్న మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఏకచత్రాధిపత్యానికి కళ్లెం పడింది. గతంలో కనుచూపు మేరలో కనిపించని టీడీపీ ఈసారి గెలుపు వాకిలి వరకు వెళ్లగలిగింది. వైసీపీ ప్రభుత్వంలో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆయన కుమారుడు రాజంపేట ఎంపీ పీవీ మిథున్‌రెడ్డి కీలకంగా వ్యవహరించారు. ప్రభుత్వం అనుసరించిన ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టిన ప్రతిపక్ష నాయకులను కేసులతో పాటు ఆర్థికపరమైన ఇబ్బందులకు గురిచేస్తూ భయపెట్టేలా చేశారు. అన్నిశాఖల్లో అనుకూలమైన అధికారులను నియమించుకుని పోలీసు రాజ్యం సాగించారు. వారి తీరుతో విసిగిపోయిన పుంగనూరు ప్రజలు అవకాశం కోసం వేచి ఉండి ఎన్నికల్లో దాదాపు ఓడించినంత పని చేశారు. తక్కువ మెజారిటీతో పెద్దిరెడ్డి బయటపడాల్సి వచ్చింది.


పెద్దిరెడ్డి

43వేల నుంచి 6వేలకు పడిపోయిన మెజారిటీ

పుంగనూరు నియోజకవర్గంలో 1,17,072 పురుష, 1,21,791 మహిళ, ట్రాన్స్‌జెండర్లు ఐదుగురితో కలిపి మొత్తం 2,38,868 ఓట్లున్నాయి. ఈ ఎన్నికల్లో 2,06,916 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. 2009 నియోజకవర్గాల పునర్విభజనలో పీలేరు నుంచి పుంగనూరుకు వచ్చి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసిన పెద్దిరెడ్డి టీడీపీ అభ్యర్థి ఎం.వెంకటరమణరాజుపై 40,299 ఆధిక్యతతో గెలిచారు. 2014లో వైసీపీ తరఫున పోటీ చేసి టీడీపీ అభ్యర్థి వెంకటరమణరాజుపై 31,731 ఓట్ల ఆధిక్యతతో రెండో సారి విజయం సాధించారు. 2019 ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి ఎన్.అనీషారెడ్డిపై 43,343 మెజార్టీతో విజయం సాధించారు. ప్రస్తుతం టీడీపీ అభ్యర్థి చల్లా రామచంద్రారెడ్డిపై 6,095 ఓట్లతో గట్టెక్కారు.


చల్లా బాబు

పోరాడి ఓడిన టీడీపీ అభ్యర్థి చల్లా బాబు

పుంగనూరు నియోజకవర్గంలో వైసీపీ పాలనలో ప్రతిపక్షాలపై రాజకీయపరంగా దాదాపు వెయ్యిమందిపై పోలీసులు కేసులు పెట్టారు. పలువురిపై రౌడీషీట్లు తెరిచారు. దీనిపై టీడీపీ అభ్యర్థి చల్లా రామచంద్రారెడ్డి అలుపెరగని పోరాటం చేశారు. పార్టీ శ్రేణులకు అండగా నిలవడమేగాక జైలుకు సైతం వెళ్లి వచ్చారు. తద్వారా ఓటర్లలో ఆయనపై నమ్మకం పెరిగింది. ఎన్నికల ఫలితాల్లో తొలి రెండు రౌండ్లు మెజారిటీ సాధించడంతో టీడీపీ శ్రేణుల్లో గెలుపుపై ఆశలు చిగురించాయి. తర్వాత రౌండ్లలో వైసీపీకి ఆధిక్యత వచ్చింది. 7 రౌండ్లలో టీడీపీ, 12రౌండ్లలో వైసీపీ ఆధిక్యత సాధించాయి. పుంగనూరు టౌన్‌లో 3,236 ఓట్లు, రూరల్‌లో 715 ఓట్లు, పెద్దిరెడ్డి సొంత మండలం సదుంలో 4,218 ఓట్లు, పులిచెర్ల మండలంలో 448 ఓట్లు వైసీపీ అదనంగా సాధించగలిగింది. చౌడేపల్లె మండలంలో 983, సోమల మండలంలో 460, చల్లా బాబు సొంత మండలం రొంపిచెర్లలో 555 ఓట్లు టీడీపీ ఆధిక్యత సాధించింది. 2,763 పోస్టల్ బ్యాలెట్ ఓట్లలో టీడీపీకి 1543, వైసీపీకి 1019, నోటాకు 20 ఓట్లు పడ్డాయి. బీసీవై పార్టీ అభ్యర్థి బోడే రామచంద్రయాదవ్‌కు 4,559 ఓట్లు, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మురళీ మోహన్ యాదవ్‌కు 3,546 ఓట్లు దక్కాయి. చివరికి చల్లా బాబుకు 94,698 ఓట్లు, పెద్దిరెడ్డికి 1,00,793 ఓట్లు రాగా వైసీపీ 6,095 ఓట్లతో విజయం సాధించింది.

చంద్రబాబు ప్రమాణస్వీకార మహోత్సవం

ప్రత్యక్ష ప్రసార వీక్షణకు ఏర్పాట్లు

నోడల్ ఆఫీసర్ల నియామకం - కలెక్టర్ షన్మోహన్

చిత్తూరు కలెక్టరేట్, జూన్ 10: రాష్ట్ర ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు ఈనెల 12న ప్రమాణస్వీకారం చేయనున్న తరుణంలో జిల్లా అంతటా వివిధ ప్రాంతాల్లో ప్రత్యక్ష ప్రసార వీక్షణకు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ షన్మోహన్ ఆదేశించారు. సోమవారం మధ్యాహ్నం కలెక్టర్ ఛాంబర్ నుంచి సీఎం ప్రమాణస్వీకార మహోత్సవానికి చేపట్టాల్సిన పలు అంశాలపై ఆర్డీవోలు, డివిజన్, నియోజకవర్గ మున్సిపల్, మండల తహసీల్దార్, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్ తదితర అధికారులతో టెలికాన్ఫరెన్స్ ద్వారా సూచనలు జారీ చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రమాణస్వీకార మహోత్సవాన్ని ప్రజలందరూ వీక్షించేలా నాగయ్య కళాక్షేత్రంలో అధికారపూర్వకంగా ఏర్పాట్లు చేయాలని చెప్పారు. నియోజకవర్గ కేంద్రాల్లోనూ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి ఔత్సాహిక యువత, ప్రజలు విజయవాడకు వెళ్లేందుకు వీలుగా నియోజకవర్గానికి నాలుగు బస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి బస్సుకు ఒక నోడల్ ఆఫీసర్‌ను నియమిస్తున్నట్లు పేర్కొన్నారు. సోమవారం రాత్రి నుంచి బుధవారం వరకు ప్రభుత్వ కార్యాలయాలన్నీ విద్యుత్ కాంతులతో వెలిగేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో జేసీ శ్రీనివాసులు, డీఆర్వో పుల్లయ్య, డ్వామా పీడీ రాజశేఖర్, డీఆర్డీఏ పీడీ తులసి, జడ్పీ సీఈవో గ్లోరియా, డీపీవో లక్ష్మి, నగరపాలక కమిషనర్ అరుణ పాల్గొన్నారు.

వరసిద్ధుడి సేవలో అసెంబ్లీ మాజీ స్పీకర్

ఐరాల(కాణిపాకం), జూన్ 10: ఏపీ అసెంబ్లీ మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం సోమవారం కాణిపాక వరసిద్ధుడిని దర్శించుకున్నారు. ఏఈవో విద్యాసాగర్ రెడ్డి ఆయనకు స్వాగతం పలికి, స్వామి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం వేదాశీర్వాద మండపంలో ఆశీర్వదించి, స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపిక అందించారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ విఘ్నేష్ పాల్గొన్నారు.


తమ్మినేనికి జ్ఞాపిక అందిస్తున్న ఏఈవో విద్యాసాగర్‌రెడ్డి

నేడు, రేపు ఎంజేఆర్ కళాశాలలో మెగా జాబ్ మేళా

పీలేరు, జూన్ 10: అన్నమయ్య జిల్లా పీలేరులోని ఎంజేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో నేడు, రేపు మెగాజాబ్ మేళా నిర్వహించనున్నట్లు కళాశాల ఛైర్మన్ ఎంపీ అవినాశ్ రెడ్డి తెలిపారు. మేజిక్ బస్ ఫౌండేషన్ ఇండియా వారి సౌజన్యంతో రెండు రోజుల పాటు జరగనున్న జాబ్ మేళాలో 50కి పైగా కంపెనీలు పాల్గొంటాయని, సుమారు వేయి ఉద్యోగాలు అందుబాటులో ఉన్నాయని ఆయన వెల్లడించారు. ఇంటర్, డిప్లొమా, డిగ్రీ, బీటెక్, ఎంటెక్, ఎంబీఏ, ఎంసీఏ కోర్సులు పూర్తి చేసిన వారందరూ జాబ్ మేళాలో పాల్గొనేందుకు అర్హులని ఆయన వివరించారు. జాబ్ మేళాలో టెక్ మహీంద్రా, ట్రెండ్స్ ఇన్ఫర్మేషన్స్, జీఎస్ఎస్ గ్లోబల్, 24/7 ఏఐ, రోబోట్-ఈడీ, సాథర్లాండ్, టీం లీజ్, ఈఓఎస్ గ్లోబ్, క్యూస్ కార్ప్, అపోలో, ఫ్యూషన్ సి ఎక్స్ యంగ్ మైండ్స్, గ్రీన్ బ్లిస్స్, కాలిబర్ హెచ్ఆర్, ఎయిర్‌టెల్ తదితర కంపెనీలు పాల్గొంటున్నట్లు తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ ఇప్పటికే తమ కళాశాలలో 30కిపైగా ప్రముఖ బహుళజాతి కంపెనీలైన టీసీఎస్, ఆక్సెంచర్, డెల్టా ఎక్స్, ఆలోహ టెక్నాలజీస్, సూర్య టెక్ ప్రాంగణ ఎంపికలు చేసినట్లు తెలిపారు. తమ కళాశాలలో చదివిన ప్రతి విద్యార్థికీ ఉద్యోగిగా అవకాశం కల్పించడమే ధ్యేయంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. మేజిక్ బస్ ఫౌండేషన్ ఇండియా ప్రతినిధి వెంకట్ మాట్లాడుతూ రెండు రోజుల జాబ్ మేళాలో ఉద్యోగాలకు ఎంపికైన వారికి ఏడాదికి రూ.5.50 లక్షల వేతనం ఉంటుందని తెలిపారు. పీలేరు పరిసర ప్రాంత నిరుద్యోగులు జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.


ఎంజేఆర్ కళాశాల ఛైర్మన్ ఎంపీ అవినాశ్ రెడ్డి

పోలీసు శునకం ఉద్యోగ విరమణ

చిత్తూరు, జూన్ 10: డాగ్‌స్క్వాడ్ విభాగంలో పనిచేసే బిందు అనే పోలీసు శునకం ఉద్యోగ విరమణ కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా వచ్చిన ఎస్పీ మణికంఠ దానికి శాలువాకప్పి, సత్కరించారు. పలు కేసుల దర్యాప్తులో బిందు సేవలను ఆయన కొనియాడారు. ఏఆర్ ఏఎస్పీ నాగేశ్వరరావు, ఏఆర్ డీఎస్పీలు మహబూబ్ బాషా, ఆర్ఐ సుధాకర్ హాజరయ్యారు.


పదవీ విరమణ పొందిన బిందు అనే శునకాన్ని సత్కరించిన పోలీసులు

బిందు శునకం వివరాలు...

బిందు 2013 జనవరి 22న జన్మించింది. ల్యాబ్రడార్ జాతికి చెందింది. వీఐపీ, వీవీఐపీ కార్యక్రమాల్లో మెరుగ్గా సేవలందించింది. కాణిపాకం, తిరుమల బ్రహ్మోత్సవాల సమయాల్లోనూ దీని సేవలను వినియోగించారు. పోలీసు డ్యూటీమీట్‌లో ప్రతిభ కనబరిచి గోల్డ్‌మెడల్ సాధించింది.

టీటీడీ పీఆర్వో బాధ్యతల స్వీకరణ

తిరుమల, జూన్10(ఆంధ్రజ్యోతి): టీటీడీ పీఆర్వో(పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్)గా నీలిమ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో పీఆర్వోగా ఉన్న రవి చీఫ్ పీఆర్వోగా పదోన్నతి పొందిన విషయం తెలిసిందే. ఈక్రమంలో ఏపీఆర్వోగా ఉన్న నీలిమ పీఆర్వోగా(ఫుల్ అడిషనల్ ఛార్జ్) నియమితులయ్యారు. ఈమేరకు ఆమె తిరుపతిలోని టీటీడీ పరిపాలన భవనంలో సోమవారం సాయంత్రం బాధ్యతలు తీసుకున్నారు.


నీలిమ

13నుంచి మహతిలో నాబార్డు మేళా

తిరుపతి(కలెక్టరేట్), జూన్ 10: తిరుపతి మహతి కళాక్షేత్రంలో ఈనెల 13 నుంచి 15వ తేదీ వరకు నాబార్డు ఆధ్వర్యంలో ఎఫ్‌పీవో మేళా-తరంగ్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు డీడీ సునీల్ తెలిపారు. ఈమేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. స్మాల్ ఫార్మర్స్ అగ్రి-బిజినెస్ కన్సార్టియం, ఓపెన్ నెట్‌వర్క్ ఫర్ డిజిటల్ కామర్స్ భాగస్వామ్యంతో ఈ మేళా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ మేళాలో గో ఆధారిత వ్యవసాయంతో పండించిన ఉత్పత్తులు, రైతులు సేంద్రియ పద్ధతిలో పండించిన ఉత్పత్తులు, చేనేతల కలంకారీ చీరలు, చెక్కతో చేసిన విగ్రహాలు, కుండలు మొదలైన ఉత్పత్తులను 50స్టాల్స్ ద్వారా ప్రదర్శించనున్నట్లు తెలిపారు. మధ్యవర్తుల ప్రమేయం లేకుండా రైతులను, కళాకారులను ప్రోత్సహించడం, వారిఆదాయం పెంచడమే ఈ కార్యక్రమం ఉద్దేశమన్నారు. ప్రజలు ఈ మేళాను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రతిరోజు సాయంత్రం 5గంటల నుంచి సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని ఆయన తెలిపారు.


14న గోవిందరాజస్వామి ఆలయంలో పుష్పయాగం

తిరుపతి (కల్చరల్) జూన్ 10: తిరుపతి గోవిందరాజ స్వామి ఆలయంలో జూన్ 14వ తేదీ శుక్రవారం పుష్పయాగం నిర్వహించనున్నట్లు టీటీడీ సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఇందుకోసం 13వ తేదీ సాయంత్రం 6.30 నుంచి రాత్రి 8 గంటల వరకు ఆలయంలో అంకురార్పణ నిర్వహిస్తారు. 14వ తేదీ ఉదయం 9.30 నుంచి 11 గంటల వరకు శ్రీదేవి, భూదేవి సమేత గోవిందరాజ స్వామి ఉత్సవ మూర్తులకు ఆలయంలో స్నపనతిరుమంజనం నిర్వహిస్తారు. మధ్యాహ్నం 1 గంట నుంచి 4 గంటల వరకు పుష్పయాగం వైభవంగా జరుగుతుంది.

20నుంచి హనుమ నాటకోత్సవాలు

తిరుపతి అర్బన్, జూన్ 10: టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్ సౌజన్యంతో ఈనెల 20నుంచి హనుమ నాటకోత్సవాలు నిర్వహిస్తున్నట్లు అభినయ ఆర్ట్స్ వ్యవస్థాపకులు బి.ఎన్.రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతూ.. అభినయ ఆర్ట్స్ 24వ వార్షికోత్సవంలో భాగంగా ఈ కార్యక్రమం తలపెట్టామన్నారు. 20నుంచి 28వ తేదీ వరకు జాతీయస్థాయి పద్యనాటకాలు, సాంఘిక నాటికలు, కూచిపూడి, భరతనాట్యం, జానపద, సోలో నృత్య ప్రదర్శనలు ఉంటాయన్నారు. ఈ పోటీలలో పాల్గొనడానికి తెలుగు రాష్ట్రాల నుంచి 32 పద్య, 57 సాంఘిక నాటికల దరఖాస్తులు అందాయన్నారు. పరిశీలన అనంతరం 9 పద్య, 12 సాంఘిక నాటికల దరఖాస్తులను ఎంపిక చేశామన్నారు. ప్రతిభకనబరచిన ప్రతి విభాగంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ నగదు బహుమతులు, రోలింగ్ షీల్డ్స్, హనుమ అవార్డ్స్, జ్ఞాపికలు అందజేస్తామన్నారు. ఈ సమావేశంలో అధ్యక్షుడు మబ్బు సూర్యనారాయణరెడ్డి, విశ్వనాథరెడ్డి, విజయ్‌కుమార్, శోభ, కోటేశ్వరరావు, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గుట్టలు మాయమవుతున్నాయ్!



కార్వేటినగరం, జూన్ 10: డిప్యూటీ సీఎం నారాయణస్వామి సొంత మండలమైన కార్వేటినగరంలో రుషికొండను తలపించేలా గుట్టల ఆక్రమణల పర్వం జోరుగా సాగుతోంది. ఎన్నికల నియమావళి అమల్లో ఉన్న సమయంలోనూ ఈ తంతు ఆగలేదు. రెవెన్యూ అధికారుల అండతో వైసీపీ నేతలు యథేచ్ఛగా తమ పని కానిచ్చేశారు. కలికిరిండ్లు గ్రామం వద్ద బల్లిగుట్ట ను ఒక నాయకుడు ఆక్రమించినా రెవెన్యూ అధికారులు కనీసం స్పందించలేదంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. అలాగే టీకేఎం పేట గ్రామ సమీపంలోని బిల్లుదొన బోటు సమీపంలో ఉన్న అడవి పై భాగాన్ని జేసీబీ యంత్రాలతో నామరూపాలు లేకుండా చేశారు. మామూళ్లకు అలవాటుపడిన రెవెన్యూ అధికారులు ఆక్రమణదారులకు సహకరించారన్న ఆరోపణలున్నాయి. పాసు పుస్తకాన్ని మార్చేందుకు లంచం తీసుకుంటూ దొరికిన అధికారిని కటకటాల పాలు చేసినా మార్పు రాకపోవడం చర్చనీయాంశంగా మారింది.



పాస్‌పోర్టు కార్యాలయంలో మొరాయించిన కంప్యూటర్లు

మూడు గంటల పాటు దరఖాస్తుదారుల పడిగాపులు

తిరుపతి(నేరవిభాగం), జూన్ 10: తిరుపతి పాసుపోర్టు సేవా కేంద్రంలో సోమవారం మూడు గంటల పాటు కంప్యూటర్లు మొరాయించాయి. దీంతో దూర ప్రాంతాల నుంచి పాసుపోర్టు దరఖాస్తు కోసం వచ్చిన అభ్యర్థులు నానా ఇబ్బందులు పడ్డారు. స్లాటు బుక్ చేసుకుని దరఖాస్తు చేసుకుని చంటి బిడ్డలతో వచ్చిన కొందరు నడి రోడ్డుపై గంటల తరబడి నిలబడ లేక నానా తంటాలు పడ్డారు. వీరికి అవసరమైన సమాచారం ఇవ్వడంలో సంబంధిత అధికారులు నిర్లక్ష్యం వహించారనే విమర్శలు వినిపించాయి. సెంట్రల్ సర్వర్ పనిచేయకపోవడంతో తిరుపతి పాసు పోర్టు కార్యాలయంలోని కంప్యూటర్లు పూర్తిగా పనిచేయలేదు. దరఖాస్తుదారులు సహనం కోల్పోయి ఆందోళనకు దిగే పరిస్థితి ఏర్పడింది. దీంతో స్పందించిన అధికారులు ఆగమేఘాలపై సంబంధిత శాఖ ఉన్నతాధికారులతో సంప్రదింపులు జరిపి మళ్లీ సర్వర్ పనిచేసేలా చర్యలు తీసుకున్నారు. 11.30 గంటల తర్వాత యథావిధిగా కంప్యూటర్లు పనిచేయడంతో దరఖాస్తు దారులు ఊపిరి పీల్చుకున్నారు. సోమవారం వచ్చిన వారందరికీ అవసరమైన సేవలు అందించి పంపారు.


క్యూలైన్‌లో వేచి ఉన్న దరఖాస్తుదారులు

పద్మ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి అర్బన్, జూన్ 10: వచ్చే ఏడాది జనవరి 26న భారత ప్రభుత్వం ప్రకటించే పద్మ అవార్డుల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సెట్విన్ సీఈవో మురళీకృష్ణ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. కళలు, సాహిత్యం, విద్య, క్రీడలు, వైద్యం, సామాజిక సేవ, సైన్స్, ఇంజనీరింగ్, ప్రజా వ్యవహారాలు, పౌరసేవలు, వృత్తి, పరిశ్రమలు తదితర రంగాలలో అత్యున్నత ప్రతిభ కనబరిచిన వ్యక్తులు అర్హులని పేర్కొన్నారు. డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.పద్మాఅవార్డ్స్ జీవోవీ.ఇన్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని, వాటిని ఈనెల 22లోపు అలిపిరి వద్ద వున్న సెట్విన్ కార్యాలయంలో అందజేయాలన్నారు. మరిన్ని వివరాల కోసం 0877-2286921, 9440573537 నెంబర్లను సంప్రదించాలని ఆయన కోరారు.

అప్పుల బాధతో కౌలు రైతు ఆత్మహత్య

వడమాలపేట, జూన్ 10: అప్పుల బాధతో కౌలు రైతు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన వడమాలపేట మండలంలోని సోమవారం జరిగింది. మండలంలోని తిరుమణ్యం గ్రామానికి చెందిన పరశురాం(43) భూమిని కౌలుకు తీసుకుని వ్యవసాయం చేసేవాడు. అందులో నష్టాలు రావడంతో గొర్రెల పెంపకం చేపట్టాడు. ఈ క్రమంలో సుమారు 15 లక్షల మేరకు అప్పులు చేశాడు. ఇటీవల గొర్రెలు వ్యాధి బారిన మృతి చెందాయి. దీంతో అప్పులు తీర్చే మార్గం లేక తీవ్ర మనస్థాపానికి గురయ్యాడు. సోమవారం పురుగుల మందు తాగాడు. స్థానికులు గుర్తించి తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ధర్మారెడ్డి తెలిపారు.


పరశురాం (ఫైల్ ఫొటో)

నేడు బంగారమ్మ జాతర

శ్రీకాళహస్తి, జూన్ 10: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా పట్టణంలోని పిచ్చాటూరు రోడ్డులో వెలసిన బంగారమ్మ ఆలయంలో మంగళవారం నుంచి జాతర జరగనుంది. ఉదయం 6గంటలకు అభిషేకం, 7గంటలకు గరిగె పూజ, అంబళ్లు, 10గంటలకు మైలు ముగ్గు, మధ్యాహ్నం 2గంటలకు పోతురాజు ముగ్గు, సాయంత్రం 4గంటలకు భక్తులు పొంగళ్లు పెడుతారు. 12వ తేదీ బుధవారం ఉదయం 6గంటలకు అభిషేకం, అలంకారం, అమ్మవారి ముగ్గు, సాయంత్రం 4గంలకు కుంభం, 6గంటలకు బంగారమ్మ అమ్మవారి ఊరేగింపు, నిమజ్జనం జరుగుతుంది. సోమవారం శ్రీకాళహస్తీశ్వరాలయ ఈవో ఎస్వీ నాగేశ్వరరావు జాతర ఏర్పాట్లను పర్యవేక్షించారు. క్యూలైన్లు, భక్తులకు వసతులను పరిశీలించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.

మృత్యుంజయస్వామికి పూజలు

శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన మృత్యుంజయస్వామికి సోమవారం ఆగమోక్తంగా పూజలు నిర్వహించారు. ముందుగా వినాయకస్వామికి పలురకాల సుగంధ ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించి కర్పూర హారతులు ఇచ్చారు. అనంతరం మృత్యుంజయ స్వామివారికి మొదట పాలు, పంచామృతం, చందనం, విభూతి, పచ్చకర్పూరంలో వైభవంగా అభిషేకాలు నిర్వహించారు. వివిధ పుష్పాలతో, గజమాల, వెండి నాగాభరణంతో స్వామివారిని శోభాయమానంగా అలంకరించి ధూప, దీప నైవేద్యాలు, మహామంగళ హారతులు సమర్పించారు. భక్తులు పెద్దసంఖ్యలో స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అధికారులు పాల్గొన్నారు.



మాంబట్టు సెజ్ డంపింగ్‌యార్డులో

అగ్నిప్రమాదం

తడ, జూన్ 10: మండల పరిధిలోని మాంబట్టు సెజ్‌లో ఓ డంపింగ్ యార్డులో అగ్నిప్రమాదం జరిగింది. పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది మంట లను అదుపు చేసేందుకు తీవ్రంగా శ్రమిస్తున్నారు. మాంబట్టు సెజ్‌లోని థైచికాస్ట్ పరిశ్రమకు సమీపంలో ప్రైవేట్ వ్యక్తులకు చెందిన డంపింగ్‌యార్డు ఉంది. అక్కడ అన్ని రకాలైన పనికిరాని వస్తువులన్నీ డంప్ చేసి ఉన్నారు. సోమవారం సాయంత్రం ఆ డంపింగ్‌యార్డులో అగ్నిప్రమాదం జరిగింది. దీంతో పక్కనే ఉన్న థైచికాస్ట్ పరిశ్రమ ఆ మంటలను ఆర్పేందుకు ప్రయ త్ని స్తూనే స్థానిక పోలీసులకు, అగ్ని మాపక సిబ్బందికి సమాచారం అందిం చింది. హుటాహుటిన అక్కడికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు మంటలను అదుపుచేసేందుకు తీవ్రంగా శ్రమిస్తున్నారు. అగ్నిమాపక దళానికి చెందిన రెండు ఫైరింజన్లు, అపాచీ పరిశ్రమకు చెందిన మరో ఫైర్ ఇంజన్ మంటలను అదుపు చేయడానికి ప్రయత్నిస్తున్నా పెద్ద ఎత్తున ఎగిసి పడుతున్నాయి. దీనికితోడు ఈదురుగాలులు సైతం తోడయ్యాయి. రాత్రి 7.30 గంటలు గడుస్తున్నా మంటలు అదుపులోకి రాకపోవడంతో పక్కనే ఉన్న థైచీకాస్ట్ పరిశ్రమకు ప్రమాదం పొంచి ఉండటంతో ఆందోళన నెలకొంది.


భారీగా ఎగిసిపడుతున్న అగ్నికీలలు

విచారణ జరపాలా..? వద్దా?

కలెక్టరును కోరిన ఆడిట్ అధికారులు

జడ్పీ మాజీ సీఈవో అవినీతిపై నిలిచిన విచారణ

చిత్తూరు రూరల్, జూన్ 10: జడ్పీ మాజీ సీఈవో ప్రభాకర్‌రెడ్డి అవినీతిపై జిల్లా ఆడిట్ అధికారులు జరుపుతున్న విచారణ తాత్కాలికంగా నిలిచింది. ఈ విచారణ ప్రారంభించేందుకు జడ్పీ విశ్రాంత అధికారి, ఉద్యోగులు ఎంతో కష్టపడ్డారు. ప్రభాకర్‌రెడ్డి రాజకీయ పలుకుబడి కారణంగా అడుగడుగునా అడ్డుపడ్డారు. చివరకు లోకయుక్తకు ఫిర్యాదు చేయడంతో విచారణ మొదలైంది. ఆడిట్ అధికారులు ఆధారాలు సేకరించి విచారణ ప్రారంభమవుతుందనే లోపే మళ్లీ నిలిచిపోయింది. గత ఆడిట్‌లో అధికారులు ప్రభాకర్‌రెడ్డి అవినీతి చేయలేదని యుటిలైజేషన్ సర్టిఫికెట్ (క్లీన్ చిట్) ఇవ్వడమే ఇందుకు కారణంగా తెలుస్తోంది. ఈ క్రమంలో విచారణ సక్రమంగా జరుగుతుందో లేదోనని థర్డ్ పార్టీకి ఇవ్వాలని జడ్పీ విశ్రాంత అధికారి, ఉద్యోగులు పీఆర్ కమిషనర్‌ను కోరినట్లు సమాచారం. దీంతో విచారణ చేయాలా..! వద్దా? అని ఆడిట్ అధికారులు కలెక్టర్‌కు లేఖ రాశారు. దీనిపై స్పష్టత రాకపోవడంతో విచారణ తిరిగి వాయిదా పడింది.



సస్పెండ్ చేయిస్తాం..

జడ్పీలో అధికారులను, ఉద్యోగులను ఇబ్బందులకు గురిచేసి నలుగురి మరణానికి కారణమైన ప్రభాకర్‌రెడ్డిని వదిలిపెట్టేది లేదని అటు ఉద్యోగులు...ఇటు టీడీపీ నాయకులు శపథం చేస్తున్నారు. ఈనెల 30వ తేదీ ఆయన ఉద్యోగ విరమణలోపు సస్పెండ్ చేయిస్తామని అంటున్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.34 కోట్లు

తిరుమల, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.34 కోట్లు లభించింది. శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ ఆదివారం పరకామణి లెక్కింపులు నిర్వహించింది. ఆదాయ వివరాలను టీటీడీ సోమవారం ఉదయం ప్రకటించింది.

మోడల్ స్కూల్లో 7, 8, 9 తరగతుల ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

శాంతిపురం, జూన్ 10: శాంతిపురం మండలం తుమ్మిసిలో ఉన్న మోడల్ స్కూల్లో 7, 8, 9 తరగతుల్లో మిగిలిన సీట్లకు ఆసక్తిగల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చని ప్రిన్సిపాల్ లత తెలిపారు. ఈ నెల 15వ తేదీలోపు విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని వెల్లడించారు. వివరాలకు ప్రిన్సిపాల్‌ను సంప్రదించాలని కోరారు.

ఉరుసు మహోత్సవంలో ఎమ్మెల్యే అమరనాథరెడ్డి



ముస్లింలతో కలిసి ప్రార్థనలు చేస్తున్న ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

పలమనేరు, జూన్10 : పలమనేరు సమీపంలోని దండపల్లి రోడ్డు పక్కన ఉన్న హజరత్ గంజేషాహిద్‌షావలి బాబా దర్గాలో జరిగిన 76వ ఉరుసు మహోత్సవంలో పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి టీడీపీ నాయకులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయనకు ముస్లింలు గజమాల వేసి ఆహ్వానించారు. అనంతరం ఆయన దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆయన వెంట పలమనేరు మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ చాంద్‌బాషా, చిత్తూరు పార్లమెంట్ టీడీపీ మైనారిటీ కన్వీనర్ ఖాజాపీర్ తదితరులు ఉన్నారు.

వి.గొల్లపల్లిలో నాగ విగ్రహాల ధ్వంసం



కుప్పం, జూన్ 10: కుప్పం మండలం వసనాడు గొల్లపల్లె గ్రామంలో ఒక చెట్టుకింద ఉన్న నాగ విగ్రహాలను గుర్తు తెలియని దుండగులు ఆదివారం రాత్రి ధ్వంసం చేశారు. సోమవారం ఉదయం ఈ విషయం గుర్తించిన గ్రామస్తులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కుప్పం అర్బన్ సీఐ రమణ, ఎస్‌ఐ సుబ్బారెడ్డిలు సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ జరిపారు. టీడీపీ నాయకుడు వైద్యం శాంతారాంతో మాట్లాడారు. వసనాడు గొల్లపల్లి పోలింగ్ బూత్ పరిధిలో టీడీపీకి మెజారిటీ వచ్చిందని దీన్ని జీర్ణించుకోలేని వైసీపీ నేతలే నాగ విగ్రహాలను ధ్వంసం చేసి ఉంటారని గ్రామస్తులు పోలీసులకు తెలియజేశారు. వెంటనే విగ్రహాలను ధ్వంసం చేసిన వారిని అరెస్టు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

మతిస్థిమితం లేని వ్యక్తికి దేహశుద్ధి



ప్రభుత్వాసుపత్రిలో రామస్వామి, అతడు వినియోగించిన ఆయుధం

కుప్పం రూరల్, జూన్ 10: కుప్పం మండలం చిన్నబంగారునత్తం గ్రామంలో మతిస్థిమితం లేని ఒక వ్యక్తికి సోమవారం గ్రామస్తులు దేహశుద్ధి చేశారు. స్థానికుల కథనం మేరకు.. గ్రామంలోని రామస్వామి అనే వ్యక్తి బల్లెంలాంటి ఆయుధం తీసుకుని పొడిచేస్తానంటూ గ్రామస్తులను బెదిరించేవాడు. ఇలా గతంలో పలుమార్లు పలువురు వ్యక్తులపై అతను దాడికి ప్రయత్నిస్తే అడ్డుకున్నారు. ఈ క్రమంలో సోమవారం గ్రామస్తులంతా కలిసి రామస్వామిని బంధించి దేహశుద్ధి చేశారు. అనంతరం చికిత్సకోసం ఆయనను కుప్పం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

టీడీపీ నేతలను సన్మానించిన మైనారిటీ నాయకులు



బైరెడ్డిపల్లె, జూన్ 10 : ఎన్నికల్లో టీడీపీ కూటమి విజయం సాధించడంతో ఆ పార్టీ శ్రేణులు సంబరాల్లో మునిగి తేలుతున్నారు. ఇందులో భాగంగా సోమవారం పలువురు మైనారిటీ నాయకులు బైరెడ్డిపల్లెలో టీడీపీ మండలాధ్యక్షుడు కిశోర్‌గౌడు, ప్రధానకార్యదర్శి సుబ్రమణ్యంశెట్టి, మాజీ ఎంపీపీ కృష్ణవేణి, మాజీ జడ్పీటీసీ రాధమ్మ, తెలుగుయువత అధ్యక్షుడు భువనచంద్రగౌడు తదితర ముఖ్యనేతలను ఘనంగా సత్కరించారు. అనంతరం నాయకులు మాట్లాడతూఊ మండలంలో టీడీపీకి బంపర్ మెజారిటీ సమష్టి కృషితోనే సాధ్యమైందని తెలియజేశారు. విజయం కోసం పనిచేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.

బైరెడ్డిపల్లెలో బీజేపీ సంబరాలు



బైరెడ్డిపల్లె, జూన్ 10 : కేంద్రంలో ఎన్డీయే ప్రభుత్వం ఏర్పడి నరేంద్రమోదీ వరుసగా మూడోసారి ప్రధాని బాధ్యతలు చేపట్టడంతో బైరెడ్డిపల్లెలో సోమవారం బీజేపీ నాయకులు సంబరాలు చేసుకున్నారు. స్థానిక నాలుగురోడ్ల కూడలి వద్ద బాణసంచాకాల్చి పలువురికి స్వీట్లు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు వెంకటరమణ, నాయకులు నటరాజ్, దుర్గప్ప, రాజప్ప, జనసేన మండలాధ్యక్షుడు చైతన్యకుమార్ తదితరులు పాల్గొన్నారు.

తీర్థంలో పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



బైరెడ్డిపల్లె, జూన్ 10 : మండలంలోని తీర్థం జడ్పీఉన్నత పాఠశాలలో 2009 -10 సంవత్సరం పదోతరగతి చదువుకున్న పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం సోమవారం కోలాహలంగా జరిగింది. పూర్వవిద్యార్థులందరూ ఒకచోట కలుసుకుని తమ పాతజ్ఞాపకాలను నెమరువేసుకుని సందడిగా గడిపారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు. వారి ఆశీర్వచనాలు అందుకున్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం

రొంపిచెర్ల, జూన్ 10: గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవడంతో ఆరోగ్యంతో పాటు రక్తం బాగా వృద్ధి అవుతుందని డాక్టర్ వినయ్ అన్నారు. సోమవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గుండె, బీపీ, షుగర్, ఉదర, రక్త పరీక్షలు చేశారు. మందులు పంపిణీ చేశారు. పౌష్టికాహారం తీసుకోవడంతో కలిగే ప్రయోజనాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఈ రాజేశ్వరి, సూపర్‌వైజర్ పంకజ, ఆరోగ్య, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

పలమనేరు
కుప్పం/పుంగనూరు

మోడల్ స్కూల్లో ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

గుడుపల్లె, జూన్ 10: గుడుపల్లె మోడల్ స్కూల్లో ఇంటర్ మెదటి సంవత్సరం ప్రవేశాలకు విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ భువనేశ్వరి తెలిపారు. ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ గ్రూప్‌లు ఉన్నాయని చెప్పారు. విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొని దరఖాస్తు కాపీని పాఠశాలలో అందజేయాలని తెలియజేశారు. ఇతర వివరాలకు పాఠశాల కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

నారా లోకేశ్‌ను కలసిన రాష్ట్ర కాపునాడు నాయకులు



చౌడేపల్లె, జూన్10: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌ను రాష్ట్ర కాపునాడు నాయకులు సాయికృష్ణ కలసి శుభాకాంక్షలు తెలిపారు. కూటమి ఘనవిజయం సాధించడంతో ఉండవల్లిలోని ఆయన నివాసంలో కలసి పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందనలు తెలియజేశారు.

గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ



బైరెడ్డిపల్లె, జూన్ 10 : బైరెడ్డిపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం మహతి ఫౌండేషన్ చైర్మన్ నాగరాజు సహకారంతో గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గర్భిణులు తీసుకోవాల్సిన ఆరోగ్య జాగ్రత్తలపై ఆరోగ్యవిద్యాధి కారి సావిత్రి అవగాహన కల్పించారు. వ్యక్తిగతశుభ్రత, తల్లిపాల ప్రాముఖ్యత, కుటుంబ నియంత్రణ, టీకాలు, సీజనల్ వ్యాధుల నివారణ తదితర అంశాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ షాలిని, మహతి ఫౌండేషన్ ప్రతినిధులు తిమ్మక్క, శ్రీనివాసులు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

సంయమనం పాటించండి: డీఎస్పీ



వి.కోట, జూన్ 10: ఎన్నికల పలితాల అనంతరం ప్రజలందరూ సంయమనం పాటించాలని పలమనేరు ఇన్‌చార్జ్ డీఎస్పీ విష్ణురఘువీర్ కోరారు. సోమవారం వి.కోట అర్బన్ స్టేషన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రశాంతంగా ఉన్న పల్లెల్లో ఎన్నికల అనంతరం కొన్ని అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోవడం సరికాదన్నారు. ఎన్నికల వరకు మాత్రమే పార్టీల కోసం పనిచేసే నాయకులు, కార్యకర్తలు ఇక్కడ ఉన్నారని ఒకరిపై మరొకరు దాడులు చేసుకునే సంస్కృతి ఈ ప్రాంతంలో లేదన్నారు. ఇటీవల కొన్నిచోట్ల శిలాఫలకాలు ధ్వంసం చేయడం, ప్రశ్నించే వారిపై దాడులకు దిగడం లాంటివి జరిగినట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ప్రజలు కక్షలు మాని ప్రశాంతంగా జీవించాలని కోరారు. ఏవైనా ఇబ్బందులు జరిగితే ప్రజలు తమ దృష్టికి తేవాలని వాటిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. రాజకీయ పక్షాలు సైతం తమ శ్రేణులు సంయమంతో ఉండేలా చర్యలు తీసుకోవాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో సీఐ లింగప్ప, ఎస్‌ఐ బాబు, పోలీసులు పాల్గొన్నారు.

వలసబాటలో పలువురు వైసీపీ నాయకులు

రహస్యంగా టీడీపీ నాయకులతో టచ్‌లోకి

చౌడేపల్లె, జూన్10: ఎన్‌డీఏ కూటమికి భారీ విజయం లభించటంతో మండలంలోని పలువురు వైసీపీ నాయకులు వలసబాటకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. టీడీపీ ప్రధాన నాయకులైన పలమనేరు ఎమ్మెల్యే అమరనాథ రెడ్డిని, పీలేరు ఎమ్మెల్యే కిశోర్ కుమార్‌రెడ్డిని రహస్యంగా కలసి శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. గతంలో టీడీపీలో పనిచేసి పదవులు పొందినవారు, ఇప్పుడు వైసీపీలో పదవులలో ఉన్నవారు, మాజీ ప్రజాప్రతినిధులు సైతం కౌంటింగ్ రోజు నుంచే పసుపు పంచన చేరేందుకు దారులు వెతుకుతున్నారు. కాంట్రాక్ట్‌ల కోసం కొందరు, సంపాదనం కోసం మరికొందరు, ఆక్రమించుకున్న భూములను కాపాడుకోవడానికి ఇంకొందరు సైకిలెక్కేందుకు సిద్ధం అవుతున్నారు.

కేంద్ర మంత్రికి టీఎన్ఎస్ఎఫ్ నేత శుభాకాంక్షలు



వి.కోట, జూన్ 10: కేంద్ర మంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన శ్రీకాకుళం ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయు డును ఢిల్లీలోని ఆయన నివాసంలో టీఎన్ఎస్ఎఫ్ నేత త్యాగరాజ్ కలసి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రం తరపున కేంద్ర మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన ఆయన ద్వారా మన రాష్ట్రానికి మంచి చేకూరాలని ఆకాంక్షించారు. ఆయన వెంట జిల్లా టీఎన్ఎస్ఎఫ్ నేతలు ఉన్నారు.

అమరావతి బయలుదేరిన టీడీపీ శ్రేణులు



కుప్పం నుంచి బయలుదేరుతున్న టీడీపీ శ్రేణులు

కుప్పం, జూన్ 10: చంద్రబాబు ప్రమాణ స్వీకారోత్సవ మహోత్సవానికి హాజరయ్యేందుకు సోమవారం కుప్పం నియోజకవర్గంలోని మున్సిపాలిటీతోపాటు నాలుగు మండలాల నుంచి తెలుగుదేశం పార్టీ శ్రేణులు అమరావతి బయలు దేరాయి. అమరావతిలో ఈనెల 12న చంద్రబాబు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయనున్న విషయం తెలిసిందే. స్థానిక ఎమ్మెల్యే అయిన చంద్రబాబు ప్రమాణ స్వీకారోత్సవంలో పాల్గొనడానికి రైళ్లు, బస్సులు, ఇతర వాహనాల ద్వారా బయలుదేరారు.

నేడు అమరావతికి ప్రత్యేక బస్సులు

చంద్రబాబు నాల్గవసారి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయనున్న సందర్భంగా మంగళవారం కుప్పం నుంచి టీడీపీ శ్రేణులు అమరావతి బయలుదేరుతాయని ఆ పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్ తెలిపారు. కుప్పంలోని టీడీపీ కార్యాలయం నుంచి ఉదయం 11 గంటలకు 4 ప్రత్యేక బస్సులు బయలు దేరుతాయని వివరించారు. 12వ తేదీన జరిగే చంద్రబాబు ప్రమాణ స్వీకారానికి రావాలనుకున్న నాయకులు, కార్యకర్తలు కుప్పం మున్సిపాలిటీ 10, 11, 12వ క్లస్టర్ ఇన్‌చార్జిలు ప్రతాప్, సత్యేంద్రశేఖర్, రవి, వినయ్‌ను సంప్రదించాలని కోరారు.

వైసీపీ అక్రమాలు వెలికితీస్తాం : చల్లా బాబు



కార్యకర్తలతో మాట్లాడుతున్న చల్లా బాబు

రొంపిచెర్ల, జూన్ 10: వైసీపీ ప్రభుత్వంలో జరిగిన అవినీతి, అక్రమాలపై విచారణ చేపడు తామని టీడీపీ నాయకుడు చల్లా రామచంద్రా రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో నియోజక వర్గానికి చెందిన పలువురు కార్యకర్తలు, నాయకులు చల్లాబాబును కలిశారు. వారికి జరిగిన కష్ట నష్టాలు ఆయనకు వివరించారు. పులిచెర్ల, రొంపిచెర్ల మండలాలకు చెందిన పలువురు అధికారులు, సచివాల యాల సిబ్బంది ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువలతో, పుష్పగుచ్ఛాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ఉయ్యాల రమణ, మురళినాయుడు, సుధాకరనాయుడు, షేక్ కరీముల్లా, సీవీ.రమణ, కడప గిరి, రవికుమార్‌నాయుడు, హరిబాబు పాల్గొన్నారు.

ఆర్టీసీలో ప్రయాణించు.. బహుమతి పట్టు



బహుమతులు అందజేస్తున్న డీఎం సుధాకరయ్య

పుంగనూరు రూరల్, జూన్10: ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించి గిఫ్ట్‌లు తీసుకోండి అంటూ పుంగనూరు ఆర్టీసీ డిపో మేనేజర్ సుధాకరయ్య పిలుపు నిచ్చారు. సోమవారం స్థానిక ఆర్టీసీ డిపో ఆవరణలో ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించి లక్కీడిప్ ద్వారా ప్రోత్సాహక బహుమతులకు ఎంపికైన ప్రయాణికులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుంగనూరు నుంచి రాయచోటి, మేటిమంద, కలికిరి, దొడ్డిపల్లె, ముళబాగల్, తిరుపతి మార్గాల్లో ఆర్టీసీ బస్సులల్లో ప్రయాణించి లక్కీడిప్ ద్వారా ఎంపికైన అహమద్‌బాషా, ఎం.బాషా, అలివేలు, శిల్పా సంతోష్, వెంకటరమణ, రెడ్డి తదితరులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయాణికులకు ఆర్టీసీ బస్సులపై ఫిర్యాదులు, సూచనలు, సలహాలు ఇవ్వాలంటే ప్రతిరోజూ ఉదయం 10 నుంచి 11.30 వరకు 9100941850కు ఫోన్ చేయాల్సి ఉంటుందన్నారు.

అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుక సీజ్



నిల్వ చేసిన ఇసుకను పరిశీలిస్తున్న గనులశాఖ అధికారులు

రొంపిచెర్ల, జూన్ 10: మండలంలోని రొంపిచెర్ల క్రాస్ సమీపంలో అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుకను సెబ్, రెవిన్యూ, పోలీస్ అధికారులు సీజ్ చేశారు. రెండు నెలల క్రితం బొమ్మయ్య గారిపల్లె పంచాయతీకి చెందిన వైసీపీ నాయకుడు గుం డూరి రామచంద్రారెడ్డి 25 టిపర్లకు పైగా ఇసుకను నిల్వ చేశారు. సోమవారం సాయంత్రం చిత్తూరు గనులశాఖ అధికారులు పూర్ణచంద్ర, సర్వేయర్ నారాయణ, స్పెషల్ ఫోర్సుబ్యూరో అధికారులు రాంబాబు, మహేష్, రొంపిచెర్ల ఎస్‌ఐ సుకుమార్, ఆర్ఐ అబ్దుల్‌ఖాదర్ ఇసుక నిల్వలను సీజ్ చేశారు.

కాణిపాకంలో మొక్కులు తీర్చుకున్న టీడీపీ నాయకులు

చిత్తూరు రూరల్, జూన్ 10: టీడీపీ అధికారంలోకి రావాలని, చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని జిల్లా కార్యాలయ కార్యదర్శి మోహన్‌రాజ్, టీడీపీ నాయకులు మొక్కుకున్నారు. ఎన్నికల్లో అఖండ విజయాన్ని అందుకొని ఈ నెల 12న సీఎంగా చంద్రబాబు ప్రమాణస్వీకారం చేయనున్న నేపథ్యంలో సోమవారం వారు కాణిపాక వినాయకున్ని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు మంజూష్, కిషోర్, గోవింద రాజులు తదితరులు పాల్గొన్నారు.

బాలకృష్ణ అభిమానుల అన్నదానం



పుంగనూరులో కేక్ కట్‌చేస్తున్న టీడీపీ నాయకులు

పుంగనూరు, జూన్10: సినీ నటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ జన్మదిన వేడుకలను పుంగనూరులో ఘనంగా నిర్వహించారు. సోమవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో టీడీపీ నాయకులు, అభిమానులు కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. టీడీపీ అధ్యక్షుడు మాధవరెడ్డి, సీవీ.రెడ్డి, పోలీస్ గిరి, బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి శ్రీకాంత్, పార్లమెంట్ యువత ఉపాధ్యక్షుడు సుబ్రహ్మణ్యంరాజు తదితరులు పాల్గొన్నారు. ● బాలకృష్ణా జిల్లా అభిమాన సంఘం నాయకుడు డాక్టర్ అప్పిరెడ్డి స్థానిక ఎన్టీఆర్ సర్కిల్లో ఎన్‌టీఆర్ విగ్రహానికి పూలమాల వేశారు. కేక్ కట్ చేశారు.

రామకుప్పం: రామకుప్పంలోని ఆటోస్టాండు సర్కిల్లో టీడీపీ మండల అధ్యక్షుడు ఆనంద రెడ్డి, ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, బీసీసెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పత్ర నారాయణాచారిలు కేక్ కట్ చేశారు. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పాలు, రొట్టెలు, పండ్లు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి రాజసింహా, జనసేన మండల అధ్యక్షుడు హరీష్, తదితరులు పాల్గొన్నారు.

రొంపిచెర్ల: రొంపిచెర్లలో బాలకృష్ణ అభిమానులు కేక్ కట్ చేశారు. పేదలకు అన్నదానం చేశారు. బాలకృష్ణ అభిమాన సంఘం పట్టణ అధ్యక్షుడు వెంకటముని, సీవీ రమణ, శ్రీను, సద్దాం, గౌష్‌బాష, సుబ్రమణ్యం, వెంకటేష్, చందు తదితరులు పాల్గొన్నారు.

వి.కోట: పట్టణంలోని ఎన్టీఆర్ కూడలిలో టీడీపీ నాయకులు, నందమూరి అభిమానులు భారీ కేక్ కట్‌చేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు రంగనాథ్, ప్రధాన కార్యదర్శి ఈశ్వర్, తెలుగు యువత ధీరజ్, శబరీష్ తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్రవాహనాలు ఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలు



గాయపడిన విశ్వనాథ్

పుంగనూరు రూరల్, జూన్10: పుంగనూరు- మదనపల్లె మార్గంలోని భీమగానిపల్లె క్రాస్ వద్ద రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటన సోమవారం జరిగింది. మండలంలోని నేతిగుట్లపల్లె పంచాయతీ కుదవూరుకు చెందిన విశ్వనాథ్(32) ద్విచక్ర వాహనంలో సొంతపనులపై పుంగనూరుకు వస్తుండగా భీమగానిపల్లె పంచాయతీ శాంతినగర్‌కు చెందిన పురుషోత్తం (30) ద్విచక్రవాహనంలో వస్తూ ఇద్దరు ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో ఇద్దరూ గాయపడ్డారు. 108లో వారిని పుంగనూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. విశ్వనాథ్ పరిస్థితి విషమంగా ఉండడంతో మదనపల్లె ప్రభుత్వ ఆస్పత్రికి తలించారు.

కాశీవిశ్వేశ్వరుడికి విశేషపూజలు



పుంగనూరు, జూన్10: స్థానిక కోనేటి వద్ద వెలసిన కాశీవిశ్వేశ్వరస్వామి సోమవారం ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఆలయ అర్చకులు సుబ్రహ్మణ్యస్వామి ఆలయాన్ని శుద్ధిచేసి మామిడి ఆకులతో తోరణాలు కట్టి స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు చేసి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. భక్తులు ఉపవాసాలతో స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

ఎరువుల వినియోగంపై అవగాహన



రొంపిచెర్ల, జూన్ 10: మండలంలోని బోడిపాటివారిపల్లె పంచాయతీలో ఖరీఫ్ సీజన్‌లో రైతులు పండించే పంటలకు చీడపీడలు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వ్యవసాయాధికారి శ్రీనివాస్ అవగాహన కల్పించారు. ఎరువుల వినియోగం, విత్తనశుద్ధి, పొలాల దుక్కుల నిర్వహణ గురించి వివరించారు. వీఏఏ వెంకట్రమణ, ఆర్‌బీకే సిబ్బంది పాల్గొన్నారు.

నేడు సోమలలో గంగజాతర

సోమల, జూన్ 10: సోమలలో మంగళవారం గంగమ్మ జాతర నిర్వహించనున్నారు. ఈనేపథ్యంలో సోమవారం పట్టణ పురవీధుల్లో బలిపోతుకు, చల్లకుండలకు ఇంటింటా మహిళలు పూజలు జరిపారు. తోటి తలారులకు కానుకలు అందజేశారు. మంగళవారం రాత్రి శివాలయం వద్ద అమ్మవారిని ప్రతిష్ఠించ నున్నారు. ఈ సందర్భంగా సోమల బస్టాండ్ నుంచి పట్టణ పురవీధుల్లో విద్యుత్ దీపాలంకరణలు చేశారు. అలాగే నంజంపేట, పొదల కుంటపల్లె, ఎం.వడ్డిపల్లె, సూరయ్యగారిపల్లె, దాసరివారి పల్లె, అడుసుపల్లె, చిన్న సోమల, ముంత్రివారిపల్లె తదితర గ్రామాల్లో జాతరను నిర్వహించనున్నారు.

వి.కోటలో బీజేపీ సంబరాలు



వి.కోట, జూన్ 10: భారత ప్రధానిగా మూడో సారి నరేంద్ర మోదీ ఎన్నిక కావడం పట్ల వి.కోటలో బీజేపీ నాయకులు సంబరాలు నిర్వహించారు. సోమవారం సాయంత్రం పట్టణంలోని దిగువ చెక్‌పోస్టులో పార్టీ జెండాను ఎగురవేశారు. స్వీట్లు పంచిపెట్టారు. భారీ కేక్ కట్‌చేశారు. బీజేపీ పలమనేరు అసెంబ్లీ కన్వీనర్ విజయ్ కుమార్, మండల అధ్యక్షుడు సోమశేఖర్ పాల్గొన్నారు.

కాణిపాకానికి పాదయాత్ర



పూతలపట్టు, జూన్ 10: చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని, పూతలపట్టు నియోజకవర్గానికి మురళీమోహన్ ఎమ్మెల్యేగా గెలుపొందితే తామంతా కాణిపాకానికి పాదయాత్రగా వెళ్ళి మొక్కులు తీర్చుకుంటామని పాపినాయనిపల్లె గ్రామస్తులు గతంలో వేడుకొన్నారు. ఈ క్రమంలో తమ కోరిక నెరవేరడంతో సోమవారం గ్రామం నుంచి కాణిపాకం వరకు పాదయాత్రగా వెళ్లి తమ మొక్కులు తీర్చుకున్నారు.

సొంత నిధులతో అద్దాల మండపం నిర్మిస్తా: ఎస్‌కే



విలేకరులతో మాట్లాడుతున్న ఎస్‌కే వెంకటరమణారెడ్డి

చౌడేపల్లె, జూన్10: స్థానిక బజారు వీధిలో వెలసిన అభీష్టద మృత్యుంజయేశ్వరస్వామి ఆలయంలో తన సొంత నిధులతో అద్దాల మండపం నిర్మించనున్నట్లు బోయకొండ గంగమ్మ ఆలయ మాజీ చైర్మన్ ఎస్‌కే వెంకటరమణారెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఆయన చౌడేపల్లెలోని మృత్యుం జయేశ్వరస్వామి ఆలయం, అంజనేయస్వామి, చౌడేశ్వరీదేవి ఆలయం, నిర్మాణంలో ఉన్న రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయాలను సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గతంలో అద్దాల మండపం నిర్మాణం కోసం భూమిపూజ చేశానన్నారు. అలాగే వేణుగోపాలస్వామి ఆలయ రాజగోపురాన్ని సైతం సొంత నిధులతో నిర్మించానని గుర్తుచేశారు. అయితే వైసీపీ ప్రభుత్వం అద్దాల మండపం పనులు చేపట్టకుండా, కలశ స్థాపన జరగకుండా అడ్డుకుందని విచారం వ్యక్తం చేశారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం రావడంతో ఆలయాల అభివృద్ధి పనులు తిరిగి ప్రారంభిస్తానని వివరించారు. ఆయనవెంట టీడీపీ నాయకులు జల్లి మనోహర్, కేశవరెడ్డి, నాగభూషణాచారి, జగదీష్, తదితరులు పాల్గొన్నారు.

చిత్తూరు

జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

కాణిపాకంలో మొక్కులు తీర్చుకున్న టీడీపీ నాయకులు



చిత్తూరు రూరల్, జూన్ 10: టీడీపీ అధికారంలోకి రావాలని, చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని జిల్లా కార్యాలయ కార్యదర్శి మోహన్ రాజ్, టీడీపీ నాయకులు మొక్కుకున్నారు. ఎన్నికల్లో అఖండ విజయాన్ని అందుకొని ఈ నెల 12న సీఎంగా చంద్రబాబు ప్రమాణస్వీకారం చేయనున్న నేపథ్యంలో సోమవారం వారు కాణిపాక వినాయకున్ని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు మంజూష్, కిషోర్, గోవిందరాజులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యాలయంలో సంబరాలు



చిట్టిబాబును సన్మానిస్తున్న నాయకులు

పాలసముద్రం, జూన్ 10: గంగాధరనెల్లూరు నియోజకవర్గం ఎమ్మెల్యేగా డాక్టర్ థామస్, చిత్తూరు ఎంపీగా దగ్గుమళ్ల ప్రసాదరావు గెలుపొందడంతో పాలసముద్రం టీడీపీ కార్యాలయంలో రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి భీమనేని చిట్టిబాబు నాయుడును సోమవారం సన్మానించారు. పలువురు అధికారులు కూడా వచ్చి ఆయన్ను పూలమాలలు వేసి, శాలువాలు కప్పి సన్మానించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు శేఖర్ రాజు, వెంకటేశులు నాయుడు, తంగరాజ్, ఉమాపతి, నాగరాజు పాల్గొన్నారు.

కాణిపాకానికి పాదయాత్ర



పూతలపట్టు, జూన్ 10: తెలుగుదేశంపార్టీ అధికారంలోకి వచ్చి చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి కావాలని, పూతలపట్టు నియోజకవర్గానికి మురళీమోహన్ ఎమ్మెల్యేగా గెలుపొందితే తామంతా కాణిపాకానికి పాదయాత్రగా వెళ్లి మొక్కులు తీర్చుకుంటామని పాపినాయనిపల్లె గ్రామస్తులు గతంలో వేడుకొన్నారు. ఈ క్రమంగా తమ కోరిక నెరవేరడంతో సోమవారం పాపినాయనిపల్లెవాసులు గ్రామం నుంచి కాణిపాకం వరకు పాదయాత్రగా వెళ్లి తమ మొక్కులు తీర్చుకున్నారు.

చిత్తూరు ఎంపీని సన్మానించిన ఎన్డీఏ నాయకులు



కార్వేటినగరం, జూన్ 10: చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాద్ రావును జీడీ నెల్లూరు నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి పొన్నా యుగంధర్ ఢిల్లోలో కలిసి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎన్డీఏ నాయకులు శ్రీధర్ యాదవ్, కోదండయాదవ్, శోభన్ బాబు, సంధాని ఉన్నారు.

అమ్మవారి గరిగె ఊరేగింపు

పూతలపట్టు, జూన్ 10: మండలంలోని ఎర్రచెరువుపల్లిలో జరుగుతున్న వీరాంజనేయస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండో రోజైన సోమవారం పాటూరు ఎల్లమ్మ ఆలయంలో ఘనంగా పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి గరిగెను ఎర్రచెరువుపల్లి గ్రామం నుంచి పొలకల సంతగేట్ వరకు పుష్పపల్లకిపై ఊరేగించారు. అక్కడే వున్న నది వద్ద అమ్మవారి విగ్రహాలకు పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. పుష్పపల్లకిని పొలకల సంతగేటు, పాటూరు, గల్లావారిఇండ్లు, ఓబయ్యగారిపల్లి, మొరవపాటూరు తదితర గ్రామాల్లో ఊరేగించగా భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. గ్రామపెద్దలు కార్యనిర్వహకులుగా వ్యవహరించారు.

వర్షం కోసం పూజలు



పాలసముద్రం, జూన్ 10: పాలసముద్రం కోనచెరువు వద్ద అటవీ ప్రాంతంలో ఉన్న కన్నికలమ్మ ఆలయంలో సోమవారం రాచపాళ్యం గ్రామస్తులు వర్షం కోసం పూజలు చేశారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి, ఆలయ ప్రాంగణంలో మేకపోతును బలిచ్చి, పొంగళ్ళు పెట్టి పూజలు చేశారు. ప్రతిఏటా జూన్ మొదటి వారంలో ఇక్కడ వర్షం కోసం పూజలు చేయడం ఆనవాయితీ. ఇక్కడ అమ్మవారికి పూజలు చేస్తే బాగా వర్షాలు కురిసి చెరువులు నిండి, పంటలు బాగా పండుతాయని ప్రజల విశ్వాసం.

ముగిసిన విరుపాక్షమ్మ తిరునాళ్ల



గుడిపాల,జూన్10: మండలంలోని కొండాపురంలో సోమవారం విరు పాక్షమ్మ తిరునాళ్ల వసంతాలతో వైభవంగా ముగించారు. ఈ సందర్భంగా అమ్మవారిని గరిగె రూపంలో అలంకరించి, బాణసంచా వేడుకల మధ్య పురవీధుల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా రంగులు చల్లుకుని, కోలాహలంగా నృత్యం చేశారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు, చుట్టుప్రక్కల గ్రామస్థులు పాల్గొన్నారు.

గిరింపేట దుర్గాంబ ఆలయ హుండీ లెక్కింపు



చిత్తూరు కల్చరల్, జూన్ 10: గిరింపేట దుర్గాంబ ఆలయంలో సోమవారం ఆలయ హుండీ లెక్కింపులో అమ్మవారికి రూ. 3,98,895లు ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈవో మునిశేఖర్ తెలిపారు. సోమవారం ఆలయ ఇన్‌స్పెక్టర్ శ్వేతారెడ్డి పర్యవేక్షణలో ఆలయ సిబ్బంది అమ్మవారి హుండీ లెక్కింపు నిర్వహించినట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది దాము, గోపి, మణి, గోపి, దుర్గ పాల్గొన్నారు.

జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో పీఎస్ఎన్ వివేకానంద విద్యార్థుల ప్రతిభ

చిత్తూరు (సెంట్రల్), జూన్ 10: జాతీయస్థాయిలో విడుదలైన జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో స్థానిక పీఎస్ఎన్ వివేకానంద విద్యార్థులు ప్రతిభ కనపరిచి ర్యాంకులు సాధించినట్లు కళాశాల కరస్పాండెంట్ పీఎస్ సత్యనారాయణ తెలిపారు. భూమిక సురేష్ భూవ్యాట్ (3279) ఆల్ ఇండియా ర్యాంకు సాధించగా, వి.ప్రీతి (4239), కె.చాందిని (4988), పి.చరితా చౌదరి (16,738) ర్యాంకు సాధించి ఐఐటీకి వెళ్లనున్నట్లు తెలిపారు. వీరిని కళాశాల యాజమాన్యం, ప్రిన్సిపాల్ నాగరాజశెట్టి, అధ్యాపకులు అభినందించారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి

పాలసముద్రం, జూన్ 10: గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని డాక్టర్ మోహన్‌కృష్ణ పేర్కొన్నారు. సోమవారం పాలసముద్రం ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో గర్భిణులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. ప్రతి 15 రోజులకొకసారి పీహెచ్‌సీలో వైద్యపరీక్షలు చేయించుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ మురళి, ఏఎన్ఎంలు అరుణ, లక్ష్మి, గంగ తదితరులు పాల్గొన్నారు.

14న సింహవాహన సేవ

చిత్తూరు కల్చరల్, జూన్ 10: నగరంలోని తేనెబండ ముత్యాలమ్మ అమ్మవారికి ఈ నెల 14న సింహవాహన సేవ నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో తిమ్మారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అమ్మవారికి కొండ చుట్టు తిరునాళ్ల నిర్వహిస్తున్నామని, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొనాలని ఆయన కోరారు. అదే విధంగా 15న అమ్మవారి అగ్ని ప్రవేశ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

వీహెచ్‌పీ నూతన కార్యవర్గం



సమావేశంలో పాల్గొన్న వీహెచ్‌పీ ప్రతినిధులు

చిత్తూరు కల్చరల్, జూన్ 10: జిల్లా విశ్వహిందూ పరిషత్ అధ్యక్షుడిగా ఎన్. సాయిరెడ్డిని సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక బ్రాహ్మణవీధి గీతాసంఘం భవనంలో వీహెచ్‌పీ జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. జిల్లావ్యాప్తంగా ఆలయాల పరిరక్షణ తదితర అంశాలపై చర్చించారు. అనంతరం కార్యదర్శిగా కె. శ్రీరాముడు, సహాయ కార్యదర్శిగా కోటేశ్వరరావు, కోశాధికారిగా శివకుమార్, ఉపాధ్యక్షులుగా సురేంద్రరెడ్డి, హేమలత, గౌరి, వేలును ఎన్నుకున్నారు.

మొగిలీశ్వర ఆలయం వద్ద అన్నదానం



బంగారుపాళ్యం, జూన్ 10: రాష్ట్రంలో టీడీపీ అత్యధిక స్థానాలను కైవసం చేసుకుని నారా చంద్రబాబు ముఖ్యమంత్రి అవుతున్న సందర్భంగా మొగిలివారిపల్లికి చెందిన టీడీపీ అభిమానులు కీలపట్లలోని కోనేటి వెంకటేశ్వరస్వామి, పలమనేరు వద్దగల ఆంజనేయస్వామి, మొగిలిలోని మొగిలీశ్వరస్వామి ఆలయాల వద్ద 101 టెంకాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ధనుంజయ నాయుడు, కృష్ణమ నాయుడు, సుబ్రహ్మణ్యం నాయుడు, బాబునాయుడు, మంజునాథ్, బాలసుబ్రహ్మణ్యం, జనార్దన్, కోదండ ఉన్నారు.

మాజీ ఎంపీ శివప్రసాద్‌కు నివాళి



చిత్తూరు సిటీ, జూన్ 10: చిత్తూరు మాజీ ఎంపీ దివంగత నారమల్లి శివప్రసాద్ జయంతి సందర్భంగా ఆపార్టీ నేతలు నివాళులర్పించారు. సోమవారం శివప్రసాద్ స్వగ్రామం చంద్రగిరి మండలం, ఐతేపల్లెలో శివప్రసాద్ సమాధివద్ద పుష్పగుచ్ఛాలుంచి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ శివప్రసాద్ ఎంపీగా జిల్లాలో అనేక అభివృద్ధి పనులు చేశారని గుర్తుచేశారు. కార్యక్రమంలో జిల్లా పార్టీ కార్యాలయ కార్యదర్శి మోహన్ రాజ్, నేతలు మురార్జి, అమర్నాథ్, గోపి పాల్గొన్నారు.

జడ్పీ కార్యాలయం తనిఖీ



చిత్తూరు రూరల్, జూన్10: జిల్లాపరిషత్ కార్యాలయాన్ని జడ్పీ సీఈవో గ్లోరియా సోమవారం తనిఖీ చేశారు. కార్యాలయంలోని అకౌంట్స్ ఎస్టాబ్లిష్మెంట్, ప్లానింగ్ 1, 2 పీఎఫ్, విద్యా విభాగాలను తనిఖీ చేశారు. సిబ్బంది కొరతపై ఆరాతీశారు. పలు సెక్షన్లలో కంప్యూటర్ల కొరత ఉందని ఉద్యోగులు ఆమె దృష్టికి తీసుకొచ్చారు.

అనుమతి లేకుండా మట్టి తవ్వితే కఠిన చర్యలు

గుడిపాల, జూన్ 10: అనుమతి లేకుండా ప్రభుత్వ స్థలాల్లో, చెరువుల్లో మట్టిని తీస్తే సంబంధిత వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ విజయలక్ష్మి అన్నారు. సోమవారం మండలంలోని పానాటూరు చెరువులో కొంతమంది తమిళనాడుకు ట్రాక్టర్ల ద్వారా జేసీబీ సాయంతో మట్టిని తరలిస్తుండగా టీడీపీ నాయకులు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో వెంటనే స్పందించిన తహసీల్దార్ ఆ మట్టిని తరలిస్తున్న ట్రాక్టర్ యజమానులకు కౌన్సెలింగ్ ఇచ్చి పంపారు.

సింగిల్‌విండో చైర్మన్ రాజీనామా

గంగాధరనెల్లూరు, జూన్ 10: గంగాధరనెల్లూరు సింగిల్‌విండో సొసైటీ త్రీమెన్ కమిటీ చైర్మన్ పదవికి వేల్కూరు బాబురెడ్డి రాజీనామా చేశారు. స్థానిక సింగిల్‌విండో సొసైటీ కార్యాలయంలో సోమవారం బాబురెడ్డి తన రాజీనామా పత్రాన్ని సీఈవో విజయకుమార్‌రెడ్డికి అందజేశారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి డిప్యూటీ సీఎం నారాయణస్వామి సహకారంతో తనకు సింగిల్‌విండో సొసైటీ త్రీమెన్ కమిటీ చైర్మన్ నామినేటెడ్ పదవి లభించిందన్నారు. ఎన్నికల్లో ప్రజాతీర్పును గౌరవిస్తూ నామినేటెడ్ పదవికి రాజీనామా చేసినట్లు ప్రకటించారు.

కార్వేటినగరంలో థామస్‌కు 8250 ఓట్ల మెజారిటీ

కార్వేటినగరం, జూన్ 10: జీడీ నెల్లూరు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీచేసిన డాక్టర్ థామస్‌కు కార్వేటినగరం మండలంలో 8250 ఓట్ల మెజారిటీ వచ్చింది. కార్వేటినగరం మండలంలో మొత్తం ఓట్లు 30729 పోల్ కాగా వైసీపీకి 10561 ఓట్లు, టీడీపీకి 18811 ఓట్లు, కాంగ్రెస్ పార్టీకి 650 ఓట్లు వచ్చాయి.

హైవే అధికారుల నిర్లక్ష్యంతో రోగులకు అవస్థలు





సీఎంసీ బస్టాపు వద్ద ఇబ్బంది పడుతున్న మహిళలు, అసంపూర్తిగా వున్న సర్వీసు రోడ్డు

గుడిపాల, జూన్ 10: చిత్తూరు-వేలూరు జాతీయ రహదారిలో వున్న 190 రామాపురం సీఎంసీ వద్ద హైవే రోడ్డు పనుల్లో అధికారులు, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం వల్ల ఆస్పత్రికి వచ్చే రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సీఎంసీ రావడానికి, వెళ్లడానికి రెండు మార్గాలుండగా రోడ్డు పనుల కారణంగా ఒక మార్గాన్ని మూసివేశారు. అయితే సర్వీసు రోడ్డు పూర్తయిన తర్వాత మూయాల్సివుంది. సర్వీసు రోడ్డు పనులు పూర్తికాకనే సీఎంసీ ప్రధాన రహదారి వద్ద ఇటు సీఎంసీకి వచ్చే వాహనాలు, రోగులు ఇబ్బందులు పడుతున్నారు. ఇదిలా వుండగా, రోడ్డు పనుల నిమిత్తం సరైన సూచిక బోర్డులు లేకపోవడంతో వన్‌వేలో వచ్చే వాహనాలు ప్రమాదాలకు గురై పలువురు మృతి చెందిన ఘటనలు ఉన్నాయి. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుపనులను పూర్తిచేసి ఇటు రోగులకు, అటు ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

వైభవంగా సూర్యప్రభ, శేషవాహన సేవలు



శేషవాహనంపై ఊరేగుతున్న స్వామివారు



సూర్యప్రభవాహనంపై ఇంద్రవరదుడు

యాదమరి,జూన్10: ఐదురోజులుగా యాదమరిలోని వరదరాజులస్వామి ఆలయంలో స్వామి, అమ్మవార్ల బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. సోమవారం ఉదయం నాగరాజులుశెట్టి ఉభయంతో మూలవర్లకు పుష్పకైంకర్యం, పెరియంబాడి పురుషోత్తం, జానకిరామ్ పిళ్లైల ఉభయంతో శ్రీదేవి, భూదేవి సమేత ఇంద్రవరదుడికి సూర్యప్రభ వాహన సేవ నిర్వహించారు. పెరియంబాడికి చెందిన దివంగత ధనంజయరెడ్డి కుమారులు రూపేష్, కిరణ్‌ల ఉభయంతో స్వామి, అమ్మవార్లకు మధ్యాహ్నం అలంకారాభిషేకం నిర్వహించగా రాత్రి మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శేషవాహన సేవ నిర్వహించారు. మంగళవారం స్వామివారికి ఉదయం పుష్పకైంకర్యం అనంతరం 9 గంటలకు గరుడోత్సవం, రాత్రి కల్ప వృక్షసేవను నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

నగరిలో టీడీపీ బ్యానర్లను కట్టనివ్వలేదు

కలెక్టర్, ఎస్పీలకు ఫిర్యాదు చేసిన టీడీపీ నేతలు



కళ్లకు గంతలతో నిరసన తెలుపుతున్న నగరిపేట టీడీపీ నేతలు

చిత్తూరు, జూన్ 10: టీడీపీ విజయం కోసం కష్టపడిన నాయకులకు, కార్యకర్తలకు నగరిలో న్యాయం జరగడం లేదని నగరిపేట మాజీ కౌన్సిలర్ లత, ఒకటవ వార్డు అధ్యక్షుడు రామానుజ చలపతి ఆరోపించారు. సోమవారం కలెక్టరేట్ వద్ద కళ్లకు గంతలు కట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి రావాలని తామంతా కష్టపడి పనిచేశామన్నారు. ఈ నెల 12న చంద్రబాబు సీఎంగా ప్రమాణ స్వీకారం చేయనున్న నేపథ్యంలో తామంతా బ్యానర్లు, ఫ్లెక్సీలు కట్టడానికి ప్రయత్నిస్తే టీడీపీ నేతలే అడ్డుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీ ముసుగులో కొంత మంది చేస్తున్న ఈ అరాచకాలను అరికట్టాలని వారు డిమాండ్ చేశారు.

మోడల్ కాలనీ పక్కన భూ కబ్జా !



కబ్జాకు గురైన భూమిలో దుక్కి దున్నుతున్న దృశ్యం

వెదురుకుప్పం, జూన్ 10: వెదురుకుప్పం మండలం తిరుమలయ్యపల్లె సచివాలయానికి సమీపంలో ఉన్న మోడల్ కాలనీ పక్కన ప్రభుత్వ భూమి, కాలువ పోరంబోకు భూమిపై కన్నుపడింది. కొందరు పక్కా స్కెచ్‌తో రూ.30లక్షల విలువ కలిగిన సుమారు రెండున్నర ఎకరం భూమిని కబ్జా చేశారు. ఈ భూమిపై కన్నుపడిన వైసీపీ నాయకుడు ఒకరు తమ అనుచరులతో కబ్జా చేయించాడని స్థానికులు అంటున్నారు. ఈ విషయం స్థానిక రెవెన్యూ అధికారులకు తెలిసినా చూసీచూడనట్లు వ్యవహరించారని స్థానికులు చెప్పారు. సోమవారం కూడా ట్రాక్టరు సాయంతో దుక్కి దున్నినట్లు చెప్పారు. ఆ భూమి చుట్టూ ఫెన్సింగ్ కూడా వేసినట్లు స్థానికులు తహసీల్దార్ దృష్టికి తీసుకొచ్చారు. దీంతో తహసీల్దార్ సానుకూలంగా స్పందించి అక్కడ దుక్కి పనులను నిలిపివేయాలని ఆదేశించినట్లు తెలిసింది.

దొరబాబు, సీఆర్ రాజన్‌లకు సన్మానం



చిత్తూరు సిటీ, జూన్11: మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, టీడీపీ చిత్తూరు పార్లమెంటు అధ్యక్షుడు సీఆర్ రాజన్‌లను సోమవారం జిల్లా టీడీపీ కార్యాలయంలో ఆ పార్టీ నేతలు, కార్యకర్తలు ఘనంగా సన్మానించారు. సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ విజయం కోసం కృషిచేసినందుకు వారిని సన్మానించారు. ఈ సందర్భంగా దొరబాబు, సీఆర్ రాజన్ మాట్లాడుతూ కూటమి అభ్యర్థుల విజయంకోసం అంకిత భావంతో పనిచేసిన పార్టీ గ్రామ కమిటీ అధ్యక్ష కార్యవర్గ కమిటీ సభ్యులకు, బూత్, యూనిట్, క్లస్టర్ ఇన్చార్జ్‌లకు మండల పార్టీ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, కార్యవర్గ కమిటీ సభ్యులకు, నియోజకవర్గ నాయకులకు పార్టీ కుటుంబ సభ్యులకు, జనసేన, బీజేపీ శ్రేణులకు కృతజ్ఞతలు తెలుపుతున్నామని అన్నారు. కార్యక్రమంలో నేతలు మోహన్‌రాజ్, దరణి ప్రకాష్, రవీంద్ర రాజు, మణికంఠ, మురళి, వెంకటేశులు, విజయ్‌కుమార్, దేవరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బాలకృష్ణ జన్మదిన వేడుకలు



చిత్తూరు సిటీ, జూన్ 10: సినీ హీరో, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ జన్మదిన వేడుకలను టీడీపీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. సోమవారం నగరంలోని గాంధీ విగ్రహం ఎదుట భారీ కేక్ కట్‌చేసి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో పార్టీ చిత్తూరు పార్లమెంటు అధ్యక్షుడు సీఆర్ రాజన్, నేతలు గురజాల చెన్నకేశవులు నాయుడు, సుబ్రమణ్యం నాయుడు, బాలాజి, గురజాల జీవన్, హేమాద్రి నాయుడు, రాజశేఖర్, ఓయం రాందాస్, జగదీశ్వర్ నాయుడు, ఈశ్వర్, ఆనంద్, అనిల్, ఫైరోజ్, రాణి, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. స్థానిక దుర్గమ్మ ఆలయంలో తాడిపత్రి బాషా బృందం ఆధ్వర్యంలో బాలకృష్ణ జన్మదినం సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

అభిమాన సంఘం ఆధ్వర్యంలో...

బాలకృష్ణ అభిమాన సంఘం నాయకులు సుధీర్, ఎల్‌బీ నాయుడు, నరసింహులు నాయుడు ఆధ్వర్యంలో సాయంత్రం ఎన్టీయార్ విగ్రహం ఎదురుగా బాలకృష్ణ జన్మదిన కేక్‌ను కట్‌చేసి పలువురికి పంచిపెట్టారు. కార్యక్రమంలో నేతలు గురజాల చెన్నకేశవులు నాయుడు, గురజాల జీవన్ నాయుడు, రాజేష్, దిలీప్, తదితరులు పాల్గొన్నారు.



కేక్ కట్‌చేస్తున్న బాలకృష్ణ అభిమానులు

గంగాధరనెల్లూరులో టీడీపీకి పెరిగిన ప్రజాదరణ

గంగాధరనెల్లూరు, జూన్ 10: గంగాధరనెల్లూరు మండలంలో మొత్తం 64 పోలింగ్‌కేంద్రాలుండగా, వాటిలో 47 కేంద్రాల్లో టీడీపీకి మెజారిటీ లభించగా, కేవలం 16 కేంద్రాల్లో మాత్రమే వైసీపీకి అధిక్యం లభించాయి. కాగా నెల్లేపల్లె ఓ పోలింగ్ కేంద్రంలో టీడీపీ, వైసీపీకి సరిసమానంగా ఓట్లు పోలుకావడం విశేషం. మండలంలో టీడీపీకి 4278 ఓట్ల మెజారిటీ లభించింది. గతంలో వేపంజేరి నియోజకవర్గంగా ఉన్నపుడు గంగాధరనెల్లూరు మండలం కాంగ్రెస్‌కు అధిక మెజారిటీ లభిస్తుండగా, గంగాధరనెల్లూరు నియోజకవర్గంగా మారినపుడు సైతం కాంగ్రెస్, అటు తర్వాత వైసీపీకి మెజారిటీ లభించే చోట ఈసారి టీడీపీ మెజారిటీతో సత్తాచాటి వైసీపీ కంచుకోటను బద్దలు కొట్టింది.

పీఏసీఎస్ డైరెక్టర్ రాజీనామా

వెదురుకుప్పం, జూన్ 10: చవటగుంట పీఏసీఎస్ డైరెక్టర్ జెగిరి మునికృష్ణారెడ్డి తన పదవికి సోమవారం రాజీనామా చేశారు తన రాజీనామా పత్రాన్ని ఉన్నతాధికారులకు పంపినట్లు మీడియాకు చెప్పారు.

కొండమల్లీశ్వరుడికి పాలాభిషేకం



వెదురుకుప్పం, జూన్ 10: డీఆర్ఎన్ కండ్రిగ సమీపంలో అరుణగిరి క్షేత్రంలో కొలువై ఉన్న జ్ఞాన ప్రసూనాంబ సమేత కొండ మల్లీశ్వర స్వామికి సోమవారం క్షీరాభిషేకం నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ ఆవరణంలో అన్నమయ్య, శివ నామ సంకీర్తనలను ఆలపించారు. అలాగే ఎగువ కన్నికాపురం సమీపంలో ఉన్న స్వయంభు సిద్ధేశ్వరస్వామి ఆలయంలో సిద్ధేశ్వరుడికి పాలాభిషేకం, రుద్రాభిషేకం నిర్వహించారు. చవటగుంటలోని ఆవుదేవర నందీశ్వరుడికి రుద్రాభిషేకం నిర్వహించారు.

భగవంతుడిని ప్రార్థించడం శ్రేయస్కరం

చిత్తూరు కల్చరల్, జూన్ 10: చిన్నారుల్లో ఆధ్యాత్మిక భావనలు వృద్ధి చెందడానికి భజన సంప్రదాయం ఎంతో దోహదం చేస్తుందని తిరుపతి శ్రీవెంకటేశ్వర సంగీత నృత్య కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ వైవీఎస్ పద్మావతి అన్నారు. సోమవారం ఆమె గిరింపేట సత్యసాయి సంస్థాన్‌లో సత్యసాయి సేవాసమతి ఆధ్వర్యంలో సత్యసాయి భజనమండలి, బాలవికాస్ విద్యార్థులకు భజన సంప్రదాయంపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె త్యాగరాజ పంచరత్న కృతులు, సత్యసాయి భజనలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో సత్యసాయి సేవాసమితి జిల్లా అధ్యక్షుడు యస్. మధుసూదనం, గజేంద్రరెడ్డి, నగర కన్వీనర్ ఆర్. శేషనారాయణ, బి. పాండురంగం, యశోద, శ్రీకంఠయ్య పాల్గొన్నారు.